ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | 5

విశాఖలో ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 : ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన 114 మంది క్రీడాకారుల బృందం గురువారం రాష్ట్రస్థాయి పోటీలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లినట్టు జేసీ తేజ్ భరత్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానం నుంచి బస్సుల్లో క్రీడాకారులు వెళ్లారు. జిల్లా తరఫున మొత్తం ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.



గోపాలపురం,నిడదవోలులో మహిళల నినాదాలు

ఆగ్రహావేశం..

- ఆశ కార్యకర్తల చలో విజయవాడ భగ్నం
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- జిల్లాలో 2500 మంది కార్యకర్తలు
- పలు చోట్ల 300 మంది అరెస్టు
- సీఎం జగన్ తీరుపై అసహనం
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- 12 డిమాండ్ల సాధనకు పోరాటం

సర్కారుపై ఆశా వర్కర్ల మండిపాటు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లు పిడికిలి బిగించారు..సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు.. జగన్‌ను గద్దె దింపుతామంటూ ప్రతినబూనారు. నిత్యం ప్రజల మధ్య ఉండే ఆశావర్కర్లకు కనీస జీతాలు కూడా ఇవ్వకపోవడంతో ఆందోళన బాటపట్టారు. ఛలో అసెంబ్లీ పేరుతో అసెంబ్లీని ముట్టడికి రోడ్డెక్కారు. ఎక్కడికక్కడ నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా ఎవరూ జంకగుండా పోలీసుల ఎదుటే సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేసి తిరుగుబావుటా ఎగరవేశారు. కనీస వేతనంతో పాటు 12 డిమాండ్ల సాధనకు ఆందోళన బాటపట్టారు. జిల్లాలో సుమారు 2500 మంది ఆశావర్కర్లు ఉన్నారు. వీరికి నెలకు వచ్చే జీతం రూ.10 వేలు మాత్రమే. అందులో కొంత కేంద్రం, కొంత రాష్ట్రం ఇస్తుంది. కానీ వీరికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాల వద్ద విధులు కేటాయిస్తున్నారు.ఇతర పనులకు ఉపయోగిస్తున్నారు. ఉదయం , సాయంత్రం కూడా రిజిష్టర్‌లో సంతకాలు చేయించుకుంటున్నారు. ప్రజలకు ఇంత సేవ చేస్తున్నా కనీసం వేతనం, ఇతర సౌకర్యాలు లేక ఆశావర్కర్లు నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. కొంత కాలం కిందట రంపచోడవరంలో నిరసనలు తెలిపారు. ఇవాళ సీఐటీయూ పిలుపు మేరకు ఛలో విజయవాడకు కదిలారు.

వారి డిమాండ్‌లు ఇవే

కనీస వేతనాలు పెంచాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలి. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిని మెటర్నిటీ లీవ్ అమలు చేయాలి.సంబంధంలేని పనులు చేయించరాదు. నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలి. శిక్షణ ఇవ్వాలి. రికార్డ్స్ ప్రభుత్వమే ఇవ్వాలి. రికార్డు లేదా ఆన్‌లైన్ పనివిషయంలో ఒక పనిని ఒకసారే చేయించాలి. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ఏ కారణంతో మరణించినా మట్టి ఖర్చులు ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలి. 62 ఏళ్ల రిటైర్మెంట్ జీవోను వర్తింపజేయాలి. రిటైర్మెంట్ అయిన వారు, మరణించిన వారి కుటుంబాలలో అర్హులను ఆశాలుగా తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. కొవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి. రూరల్‌లో 1000 నుంచి 1200 మంది. పట్టణాల్లో 2000 నుంచి 2500 మంది జనాభాకు ఒకరి వంతున నియమించాలి. ఏఎన్ఎం ట్రైనింగ్ ఇవ్వాలి. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి. నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి. రాజకీయజోక్యం తొలగించాలి. ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ పొందిన ఆశా వర్కర్లను ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీలు, స్టాఫ్ నర్స్ నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలి.

300 మంది అరెస్టు...

'చలో విజయవాడ' కార్యక్రమానికి బయలుదేరిన 'ఆశా' మహి ళలకు మళ్లీ అడుగడుగునా నిరాశే మిగిలింది. నిరసనకు అనుమతిలేదంటూ జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో తెల్లవారు జాము నుంచే పోలీసులు మోహరించారు. వాహనాలనూ తనిఖీ చేసిన పోలీసులు ఆశాలని అనుమానం వస్తే దించి వేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ ఆశావర్కర్లు వైసీపీ ప్రభుత్వం మీద తిరుగుబావుటా ఎగరవేశారు. కనీస వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌తోపాటు మొత్తం 12 డిమాండ్లతో గురువారం ఛలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధం అయ్యారు. పోలీసులు అందరికీ నోటీసులు ఇవ్వడంతో పాటు, కొందరిని గృహనిర్బంధం చేశారు. నోటీసులను లెక్కచేయకుండా విజయవాడ బయలుదేరిన మహిళలను ఎక్కడికక్కడే ఆపేసి పోలీస్‌స్టేషన్లకు తర లించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు తూర్పుగోదావరితో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి గురువారం ఉదయం ఆశాలు చేరుకున్నారు.వాళ్లను రైళ్లు ఎక్కకుండా టూటౌన్, ప్రభుత్వ రైల్వే పోలీసులు అడ్డుకున్నారు. సుమారు 66 మంది ఆశాలను రైల్వే స్టేషను సమీపంలోని ఓ కల్యాణ మండపానికి తరలించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 300 మందికిపైగా ఆశా వర్కర్లను పోలీ సులు అరెస్టు చేశారు.సాయంత్రం వరకూ ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు కాపలా ఉన్నారు. ఇళ్లకు వెళతామని 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి వెళ్లబోమని ఆశాల దగ్గర నుంచి సంతకాలు తీసుకొని సొంత పూచీకత్తుపై పంపించేశారు.అయినా ఆందోళనకారులు లెక్కచేయలేదు. పోలీ సుల ఎదుటే సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆశా వర్కర్లు ఆందోళనకు దిగడంతో ప్రజలకు వారు అం దించే సేవలు ఆగిపోయాయి.



జగన్‌కు బుద్ధి చెబుతాం..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 : చలో విజయవాడకు బయలుదేరిన ఆశా వర్కర్లపై జగన్ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి చేపట్టిన అరెస్టులు, నిర్బంధాలకు వ్యతిరేకంగా గురువారం సాయంత్రం ఆశా వర్కర్లు రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్లో నిరసన ధర్నా చేపట్టారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కనీస వేతనం రూ.25 వేలు చెల్లించాలని, యాప్స్ పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తమకు వర్తింప చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ సచివాలయ పోలీసులను ఆశా వర్కర్ల ఇళ్లకు పంపించి వారిని పోలీస్టేషన్లకు తరలించడం దుర్మార్గమన్నారు. జగన్మోహనరెడ్డి ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు కురిపించారని, సీఎం అయ్యాక ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన గణపాఠం చెబుతాన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రాణి, జయలక్ష్మి పాల్గొన్నారు.



కొవ్వూరులో ఆశాల నిర్బంధం

కొవ్వూరులో హైవేపై అడ్డగింత

250 మందిని నిర్బంధించిన పోలీసులు

కొవ్వూరు, ఫిబ్రవరి 8 : వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆశా వర్కర్లు ప్రతినబూ నారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి విజయవాడ తరలివెళ్తున్న ఆశా వర్కర్లను కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనకాపల్లి, పార్వతీపురం, విశాఖపట్నం, నర్సీపట్నం, గోకవరం ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ తరలివెళ్తున్న మూడు టూరిస్ట్ బస్సులు, 1 తుఫాన్ వాహనం, రెండు మహీంద్ర ఆటోలతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరిన సుమారు 250 మంది ఆశా వర్కర్లను తెల్లవారుజామున 3,4 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్బంధించారు.చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అనుమతి లేదని వారందరిని తిరిగి వెనక్కి పం పించి వేశారు. సానుకూలంగా నిరసన తెలపడానికి వచ్చిన మహిళలను మహిళా పోలీసులు లేకుండా మగ పోలీసులే నిర్బంధాలకు గురి చేయడం సరికాదన్నారు.

నిడదవోలు రైల్వే జంక్షన్‌లో..

నిడదవోలు, ఫిబ్రవరి 8 : ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా కార్యకర్తలు అడ గడంతో వారిని అక్రమ అరెస్టులు చేశారని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నిడదవోలు రైల్వే స్టేషన్ నుంచి గురువారం ఆశా కార్యకర్తలు ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళుతుండగా చాగల్లు, నిడదవోలు పట్టణ మండల గ్రామాలకు చెందిన సుమారు 40 మందిని పోలీసులు అరెస్ట్ చేసి సమీపంలోని తాలూకా రైస్ మిల్లర్స్ హాలుకు తరలించారు. అనంతరం పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై ఆశాలను విడుదల చేశారు.



మేము ఎలా బతకాలి సారూ...

సీతానగరం,ఫిబ్రవరి 8 : మాకు నెలకు ప్రభుత్వం ఇచ్చే జీతం పది వేలు. ప్రభుత్వం అప్పగించిన పనులు చేయడానికి సగం జీతం అయిపోతోంది. 24 గంటలు పనిచేయాలని చెబుతున్నారు. ఇంక మేం ఎలా బతకాలి సార్.. అందుకే మా న్యాయమైన డిమాండ్ల సాధనకు ధర్నాకు వెళుతున్నాం.. మీరు అరెస్టు చేస్తే చేసుకోండి.. ఎక్కడికి తీసుకువెళతారో తీసుకెళ్లండి మేము మాత్రం ఎక్కడ ఉంటే అక్కడే మహాధర్నాకు సంఘీభావం తెలుపుతామని ఎస్ఐకు తెలిపారు. సీతానగరం మండల ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు కుమారి మాట్లాడుతూ ప్రభుత్వోగులమని మాకు అన్ని ప్రభుత్వ పథకాలు కట్‌చేశారు. మాకు ప్రభుత్వం నుంచి ఏవిధమైన లబ్ధి లేకుండా చేశారు. చేసిన పనికి సరిపడా జీతం కోరుతున్నాం. సీఎం జగన్‌కు ప్రజల గురించి ఆలోచించే సీఎం అయితే మా గురించి ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.



అనపర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఓటింగ్‌పై దృష్టి పెట్టండి

అనపర్తిలో కలెక్టర్ మాధవీలత

అనపర్తి, ఫిబ్రవరి 8 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత అన్నారు. అనపర్తి జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఎల్‌వోలు ఇతర ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. బీఎల్‌వో తన పోలింగ్ కేంద్రం ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి ఒక్క తప్పు లేకుండా జాబితాలోని పేర్లను నిర్ధారణ చేసుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెంచే క్రమంలో ఓటరు జాబితా కీలకమన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ విధులు నిర్వహించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం అనపర్తిలోని శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అదే పాఠశాలలో ఏర్పాటు చేసిన నెంబరు తొమ్మిది పోలింగ్ స్టేషన్‌కు పరిశీలించారు. అనపర్తి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు ఈ కేంద్రం నుంచే మెటీరియల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇదే పాఠశాలలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా సెక్టార్లు ఏర్పాటు చేసి ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు మెటీరియల్ అందజేస్తామన్నారు. రూట్ మ్యాప్ ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారు లను ఆదేశించారు. అదే పాఠశాలలో కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని ఇష్టంతో చదివితే విజయం వరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఆర్‌వో ఎం.మాధురి, ఈఆర్‌వోలు నాగరాజు నాయక్, డి సునీల్ కుమార్, లతీఫ్ భాషా, ఈఆర్‌వో టి రామచంద్రారెడ్డి, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు అధికారులు పాల్గొన్నారు.

85.76 ఎకరాలు.. రూ.12.26 లక్షలు

గోపాలపురం, ఫిబ్రవరి 8: శ్రీసీతారామస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయ భూములతో పాటు పెరుమాళ్ళ రెడ్డి సత్రం, శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ భూములకు దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు గురువారం కౌలు వేలం నిర్వహించారు.శ్రీ సీతారామస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయానికి 54.12 ఎకరాలు, పెరుమాళ్ల రెడ్డిసత్రం 20. 92 ఎకరాలు, శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి 10.72 ఎకరాలు మొత్తం 85.72 ఎకరాల భూమికి బహిరంగ వేలం నిర్వహించగా 35 మంది రైతులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నట్టు తెలిపారు. వారిలో 14 మంది రైతులు హెచ్చుపాట పాడి భూములు దక్కించుకున్నారన్నారు. 54.12 ఎకరాలకు గతేడాది రూ.7,75,500 పాటగా వెళ్లిందని ఈ ఏడాది రూ.8,75,500కు వెళ్లినట్లు తెలిపారు. 20.92 ఎకరాలకు గతేడాది రూ.1,39,500 ధర రాగా ఈ ఏడాది రూ.2,38,500, 10.72 ఎకరాలకు గత ఏడాది రూ.94 వేలు ఈ ఏడాది రూ.1,12,000 పలికిందన్నారు. మొత్తంగా రూ.12.26 లక్షల ఆదాయం సమకూరుతుందని ఆలయ ఈవో మీసాల నాగరాజు, వేలం ప్రక్రియ పర్యవేక్షణ అధికారి సృజన్ కుమార్ తెలిపారు.

నేడు చాగల్లులో షర్మిలరెడ్డి రచ్చబండ

చాగల్లు, ఫిబ్రవరి 8 : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి శుక్రవారం చాగల్లులో జరిగే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏ.అరుణకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పర్యటన వివరాలను వెల్లడించారు. ఉదయం 10 గంటలకు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. గత రెండు రోజులుగా పర్యటిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆమె చాగల్లు నుంచి బయలుదేరి కొవ్వూరు చేరుకుని యువరాజ్ ఫంక్షన్ హాల్‌లో కాసేపు బస చేస్తారు. అక్కడే భోజనం చేసి కాకినాడ బయలుదేరి వెళతారు. ఆమెతో పాటుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొంటారని అన్నారు.



కాకరపర్రు వద్ద ఏటిగట్టుపై నిలిపి ఉంచిన లారీలు

అక్రమంగా తరలిపోతున్న మట్టి, ఇసుక

- గోదావరి ఏటిగట్టుపై లారీల అడ్డగింత
- ఆందోళనకు దిగిన కాకరపర్రు గ్రామస్తులు
- పోలీస్ స్టేషన్‌కు లారీలు తరలింపు

పెరవలి,ఫిబ్రవరి 8 : కాకరపర్రు వద్ద అక్రమంగా ఇసుక మట్టి తరలిస్తున్న లారీలను గ్రామానికి చెందిన పలువురు గోదావరి ఏటిగట్టుపై అడ్డుకుని ఆందోళన చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా ప్రతి రోజూ వందలాది లారీల్లో ఇసుక మట్టి తరలిపోతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన కొంత మంది గురువారం రాత్రి ఏటిగట్టుపైకి వెళ్లగా అప్పటికే ఇసుక లోడు చేసుకుని వెళుతున్న లారీలను అడ్డుకుని నిలిపివేశారు. అనంతరం మరికొంత మంది వెళ్లి ఏటిగట్టుపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పురుషులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. తమ గ్రామ పరిధిలో అక్రమంగా తవ్వకాలు చేయడం వల్ల లంక భూములు కోతకు గురవుతాయని.. భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆరోపించారు. అక్రమార్కుల వల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతుందన్నారు.మట్టి తవ్వకానికి అనుమతులున్నాయని చెబుతున్నారని.. చూపించమంటే చూపించడం లేదని ఆరోపించారు. పెరవలి ఎస్ఐ మూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి నిలిపివేసిన లారీలను స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. ఆందోళనకారులు అడ్డుకుని సమస్య ఇక్కడే పరిష్కరించాలని పట్టుబట్టారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేసి అనుమతులు పత్రాలు పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు అంగీకరించారు. దీంతో లారీలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అంతర్మథనం

వైసీపీ నాయకుల్లో అయోమయం

- సీట్లిచ్చినా కానరాని ఉత్సాహం
- గోపాలపురంపై వనిత కినుక
- కొవ్వూరుపై తలారిది అదే మాట?
- బదిలీలపై చెప్పలేని బాధ
- ఇంకనూ తేలని రాజానగరం
- బి.ఫారం ఇచ్చే వరకూ నో గ్యారంటీ
- కేడర్ నోట ఇదే అనుమానం
- వైసీపీలో న..గరం..గరం
- రూరల్‌లో వేణు రూటు..సెపరేటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో వైసీపీ నాయకుల పరిస్థితి కక్కలేక మింగలేక అనే చందంగా తయారైంది. సిట్టింగులతోపాటు మరికొందరు ఆశావహులను నియోజకవర్గ ఇన్‌చార్జులుగా పార్టీ అధిష్టానం నియమిస్తున్నా వాళ్ల మోములో ఉత్సాహం మాత్రం కరువైందనే ప్రచారం సాగుతోంది. జగన్మోహనరెడ్డి ఆటలో పావులుగా మారిపోయామా? అనే 'అంతర్మథన'మే దానికి అసలైన కారమణమని వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిలను కొన్ని చోట్ల మార్పు చేసినా.. కొత్తగా ప్రకటించినా..రాజకీయ బదిలీలు చేసినా.. జగన్ ఆలోచనా సరళిని బట్టి నామినేషన్లు వేశాక గానీ సీటు ఖాయం కాదని ఆ పార్టీ నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. మరోవైపు టీడీపీ గ్రాఫ్ రోజు రోజుకూ పెరుగు తుండడంతో వైసీపీ పోటీదారులు తమ రాజకీయ జీవి తంపై పునఃపరిశీలనలో పడుతున్నారు.

సీట్లు.. తలపోట్లు..

హోంమంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం పంపించి, అక్కడ ఉన్న తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు.అయితే తాను కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గోపాలపురంలో తనకు ఎవరు ఓటేస్తారంటూ హోంమంత్రి తన అంతరంగికుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు తీసుకొచ్చినా ఆయన లోనూ అదే అసహనం ఉందని చెబుతున్నారు. ఈ పరిణామాలతో తానేటి వనిత సామాజికవర్గం నాయకులు అయోమయంలో ఉన్నారు. రాజానగరం ఎమ్మెల్యే, తూర్పుగోదావరి వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా తమ్ముడు జక్కంపూడి గణేశ్‌కు ఎమ్మెల్యే సీటు ఇస్తారనే ప్రచారం జరుగుతుండడంతో పాటు అలా చేస్తే రాజాకు సీటు దక్కుతుందా లేక ఫ్యామిలీ ప్యాకేజీ ఉంటుందా అన్న చర్చ కూడా నడుస్తోంది. జగన్ ఇప్పటి వరకూ విడుదల చేసిన జాబితాల్లో రాజానగరం స్థానంపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. కానీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజా తనపని తాను చేసుకుపోతున్నారు. గణేశ్‌కు రాజానగరం సీటు ఇస్తే రాజాను ఎంపీగా బరిలో నిలిపే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపించినా ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ని ప్రకటించడంతో ఆ అవకాశానికీ తెరపడింది. ఎంపీ భరత్‌రామ్‌కు ఎమ్మెల్యే రాజాకు మధ్య కోల్డ్‌వార్ ఈనాటిది కాదు. బ్లేడ్ బ్యాచ్‌ల విషయంలో ఇద్దరికీ వైరం నడుస్తూనే ఉంది. రాజా కుటుంబానికి సీట్లు కేటాయించే విషయంలో కూడా భరత్ ప్రమేయం ఉందనే ప్రచారం నడుస్తోంది.

గూడూరి సంగతేంటో..

డాక్టర్ గూడూరిని ఎంపీ భరత్ తన వ్యూహంలో భాగంగా పార్టీలోకి తీసుకొచ్చారనే వాదన ఉంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు నియోజకవర్గాలున్నా ముందు నుంచీ భరత్ రాజమహేంద్రవరం సిటీపైనే కన్నేశారు. మిగతా నియోజకవర్గాలను పెద్దగా పట్టించుకోలేదు. వాస్తవానికి గూడూరిని పార్టీ కార్యక్రమాల నిర్వహణ ఖర్చులకు తీసుకొచ్చారనే విమర్శలు గతం నుంచే పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇప్పుడు గూడూరిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వైసీపీ ఖర్చులకు గల్లాపెట్టె దొరికినట్లయిందని పార్టీలోని ఆయన వ్యతిరేకులు చెప్పుకుంటున్నారు.ఎంపీ భరత్ వ్యూహంలో గూడూరి పక్కాగా చిక్కుకున్నట్టు కనిపిస్తోందని ప్రచారం సాగుతోంది. మరోవైపు రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జి చందన నాగేశ్వర్‌కి మొండిచెయ్యి చూపించారు. రాష్ట్ర స్థాయి పదవి అంటూ గ్రీనరీ కార్పొరేషన్ చైర్మన్ గిరీ తాయిలం చూపించి.. తాను మొదటి నుంచీ ఆశ పెట్టుకున్న రూరల్ నియోజకవర్గంతో ఏ మాత్రం సంబంధంలేని మంత్రి వేణుని తీసుకొచ్చి కూర్చోబెట్టారు. దీంతో చందన నాగేశ్వర్ రూరల్‌లో తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎన్నికల కోసం రూపొందించుకున్న కేడర్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మంత్రి వేణు ఇప్పుడు రూరల్ కేడర్, ప్రజలతో పరిచయం పెంచుకొనే పనిలో ఉన్నారు. కానీ చందన నాగేశ్వర్‌కు చెందిన క్యాడర్‌ని కలుపుకోవడం లేదనే విమర్శలున్నాయి. పైగా వేణు కార్యక్రమాలకు వైసీపీ నాయకుల కంటే అధికార గణమే ఎక్కువగా ఉంటోంది. పంచాయతీ, రెవెన్యూ అధికారులపై ఖర్చు లను రుద్దేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మూడు పెద్ద కార్యక్రమాలకు ఎక్కువ మొత్తంలో జేబులకు చిల్లు పడడంతో అధికారులు తమ ఆవేదనను పంటిబిగువున అదిమిపట్టుకుంటున్నారని చెబుతున్నారు.

నామినేషన్ వేశాక గానీ?

ఇదంతా ఒకెత్తు అయితే జగన్ స్థిమితం లేని నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుంటే ఎమ్మెల్యేగా నామినేషన్ సమర్పించే వరకూ అభ్యర్థులుగా ప్రచారంలో ఉన్నవారిలో అయోమయం అలాగే ఉంటుందని పార్టీలో వాదనలు వినవస్తున్నాయి. ఎవరికి వారు ఎమ్మెల్యే అభ్యర్థులమంటూ హల్‌చల్ చేయడం మినహా బీఫాం ఇచ్చాక గానీ నిజనిర్ధారణ కాదని అంటున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైరపర్సన్‌గా మరో సారి అవకాశం లభిస్తుందని మేడపాటి షర్మిళారెడ్డి, ఆమె వర్గం భావించింది. చివరి దాకా వైసీపీ పెద్దలు అదే ఆశ కల్పించారు. దీనికి అనుగుణంగా రుడా చైర్‌పర్సన్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్టే ఇచ్చి దాన్ని రద్దు చేసి ఆ సీటులో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావును ఖరారు చేశారు. షర్మిళను హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా విజయవాడ పంపించేశారు. ఎంపీ భరత్‌కు షర్మిళకు మధ్య కొన్నాళ్లుగా రాజకీయ వైరం ఉంది. ఈ నేపథ్యంలో రౌతును పట్టుబట్టి ఇక్కడికి తీసుకొచ్చి షర్మిళను సిటీకి దూరం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి బలాన్ని చేకూర్చే విధంగా పోలీస్ కన్వెన్షన్ హాలులో డిసెంబరులో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఎంపీ కొన్ని వ్యాఖ్యలు చేశారు. రుడా అంటే ఏంటో ఇకపై చూపిస్తామంటూ గత రుడా పాలనను పరోక్షంగా విమర్శించారు. ఎంపీ వ్యూహంలో భాగంగానే షర్మిలను సిటీ నుంచి పంపించేసి రుడా చైర్మన్ గా రౌతు సూర్యప్రకాశరావును నియమింపజేసుకున్నారని జనం బలంగా నమ్ముతున్నారు. రుడా చేతిలో ఉండే అధికారాన్ని వాడుకొని ల్యాండ్ పూలింగ్ అంటూ తేలిగ్గా ఆస్తులు కూడబెట్టవచ్చనే ఆలోచనలో రౌతును పావుగా చేయడానికే ఇప్పుడు పదవిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇదేనా మహిళా సాధికారత..

ఇక మహిళల పట్ల వైసీపీ అధిష్టానం అనుసరిస్తున్న తీరు చూస్తుంటే నోటితో పొగుడుతూ నొసటితో వెక్కిరించిన చందంగా ఉందనే ఆవేదన మహిళా నేతల్లో వ్యక్తమవుతోంది. నా అక్కా చెల్లెమ్మలు అంటూనే జగన్ తమకు అన్యాయం చేస్తున్నారనే భావన ఉంది. పార్టీని నమ్ముకొని ఉన్న డాక్టర్ అనసూరి పద్మలతకు ఆశజూపి మోసం చేశారనే చర్చ పార్టీ వర్గాల్లో నలుగుతోంది. ముందు నుంచీ ప్రజల్లో ఉంటూ ఎంపీ సీటు తనదేనని అనుకొన్న తరుణంలో గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చి ఆ మహిళ కంట నీళ్లు పెట్టించారనే విమర్శలున్నాయి. మరోవైపు తానేటి వనిత స్థానాన్ని మార్పు చేసి ఆమెనూ ఇబ్బంది పెడుతున్నారని అంటున్నారు. రుడా చైర్మన్ పదవి మళ్లీ తనకే దక్కుతుందని మేడపాటి షర్మిల ఆశపడ్డారు. వైసీపీ పెద్దలు చైర్మన్ పదవిలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఆ వెంటనే రద్దు చేయడం ద్వారా ఆమెను కూడా ఇబ్బంది పెట్టారని చెబుతున్నారు. ఇలా, అన్ని రకాలుగా పార్టీలోని మహిళలను వైసీపీ నేతలు ఆ ణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారనే భావన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోందని చెబుతున్నారు.



పిఠాపురం-కాకినాడ జాతీయ రహదారిపై



గొల్లప్రోలు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద..



మంచు దుప్పటి

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 8: జాతీయ రహదారి పరిసరాలు, రహదారులు, పంట పొలాలు, భవనాలను గురువారం తెల్లవారుజామున మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం పది గంటల వరకూ అలుముకున్న మంచుతో రహదారులపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెల్లవారుజామున రోడ్లపై ఏమీ కనిపించకపోవడంతో గంటన్నర పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చలితీవ్రత కొంత మేర తగ్గుముఖం పట్టి, పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గురువారం భిన్నమైన వాతావరణం కనిపించింది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు 216వ జాతీయ రహదారి, పంట పొలాలను మంచు కప్పేసింది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించని పరిస్థితి నెలకొంది. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల్లో భవనాలపై పొగమంచు ఆవరించింది. ఇంత దట్టంగా పొగమంచు ఆవరించడం ఇదే తొలిసారి అని పలువురు తెలిపారు.

వాడపల్లి ఆలయానికి డీసీ హోదా

డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిశోర్‌కుమార్



ఆత్రేయపురం, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో వార్షిక ఆదాయం రూ.5 కోట్లు పైబడి వస్తున్న ఆలయాలకు ప్రభుత్వం ఎట్టకేలకు డిప్యూటీ కమిషనర్ హోదా కల్పించింది. ఏడాది క్రితమే ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి పరిపాలనా ఆమోదం పొందగా కేబినెట్ తీర్మానం పొందింది. ఆ దిశగా రాష్ట్రంలో ప్రధాన ఆలయాలకు డీసీ, ఏసీ హోదాలు దక్కాయి. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక ఆదాయం రూ.12 కోట్లకు పైగా చేరుకుంది. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ప్రస్తుతం గ్రేడ్-1 ఈవోగా ముదునూరి సత్యనారాయణరాజు పని చేస్తున్నారు. ఆలయానికి డీసీ హోదా లభించడంతో సదరు గ్రేడ్ అధికారిని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ సహాయ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ పదోన్నతి పొంది ఉప కమిషనర్ హోదాలో వాడపల్లి ఆలయ ఈవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిశోర్‌ను ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీ హోదా దక్కడంతో పరిపాలనా సౌలభ్యంతో పాటు భక్తుల సమస్యలను సకాలంలో పరిష్కరించగలగడం, అభివృద్ధి పనులపై త్వరితగతిన నిర్ణయం తీసుకునే అధికారం ఆయనకు ఉంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న కిశోర్‌కుమార్

ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ

- బ్యాంకు వెనుక నుంచి చొరబడిన దుండగులు
- రూ.25 లక్షల నగదు, రూ.50 లక్షల బంగారం అపహరణ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 8: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ జరిగింది. బ్యాంక్ కార్యాలయం వెనుక ఉన్న ఇనుప కిటికీని గ్యాస్ కట్టర్‌తో తొలగించి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ చోరీ జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరకంచి మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో పెద్దిపాలెం రహదారి మార్గంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ శాఖలో దుండగులు చొరబడ్డారు. బ్యాంక్ కార్యాలయం వెనుక భాగాన ఉన్న కిటికీ ఇనుప గ్రిల్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఆ మార్గం గుండా దుండగులు బ్యాంకులోకి ప్రవేశించారు. బ్యాంకులోని అలారం, సీసీ కెమెరాలు పని చేయకుండా చేసి చాకచక్యంగా చోరీకి పాల్పడ్డారు. బ్యాంక్ స్ట్రాంగ్ రూంలోని రెండు లాకర్లు తెరిచి వాటిలో రూ.25 లక్షలు నగదు, మరో 50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను దుండగులు అపహరించారు. గురువారం ఉదయం బ్యాంకుకు వచ్చిన అధికారులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతా



కుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి ఎస్ఐలు పవన్‌కుమార్, సతీష్, జబీర్‌లతో పాటు జగ్గంపేట, అన్నవరం, రౌతులపూడి ఎస్ఐలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్పీ దుండగులు చొరబడ్డ బ్యాంక్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ చోరీకి ఆరుగురు వ్యక్తులు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్లూస్‌టీం, డ్యాగ్ స్క్వాడ్‌లు రప్పించి తనిఖీలు చేపట్టారు. ఈ చోరీ సంఘటనపై ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ కోటి రూపాయలు సొత్తు చోరీకి గురైందని రూ.25 లక్షలు నగదు, మరో రూ.50 లక్షలు బంగారం ఉందని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఉత్తరకంచి ఎస్‌బీఐలో చోరీ జరిగిందనే విషయం తెలిసి ఆ బ్యాంక్ పరిధిలోని ఖాతాదారులు, ప్రజలు బ్యాంకు వద్దకు తరలివచ్చారు. మెయిన్ రోడ్డులో ఉన్న బ్యాంక్‌లో చోరీ జరగడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్ బ్యాంకు పరిసరాల్లో కలియతిరిగాయి. క్లూస్‌టీం బృందం లాకర్లు, స్ట్రాంగ్ రూంల వద్ద వేలి ముద్రలు సేకరించింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

ఇళ్ల పట్టాల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన

బిక్కవోలు, ఫిబ్రవరి 8: అనపర్తి నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. బిక్కవోలు, బలభద్రపురం గ్రామాల్లో జరిగిన అవకతవకలపై ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. బిక్కవోలులో 180 మంది, బలభద్రపురంలో 140 మందిని ఏ కారణం లేకుండా అనర్హులుగా చేర్చారన్నారు. బిక్కవోలులో 1100 మందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. 180 మంది పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో లేని అనర్హులకు పట్టాలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. బిక్కవోలు ఇళ్ల పట్టాల పంపిణీలో రూ.12 కోట్లు చేతులు మారాయన్నారు. బదిలీపై వెళ్లిపోయిన తహశీల్దార్ పోసిబాబు రాత్రికి రాత్రి గుట్టు చప్పుడు కాకుండా పాత తేదీలతో 120 పట్టాలపై సంతకాలు చేశారని, అలాగే బలభద్రపురంలోనూ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చిందన్నారు. నియోజకవర్గమంతా ఇదే పరిస్థితి ఉందని, అందువల్ల విజిలెన్స్ విచారణ జరపాలని రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకుని పట్టాలు రాని మహిళలతో కలసి గురువారం ఆయన బిక్కవోలు టీడీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సింగారపు రామారావు, రమేష్, సిద్ధు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 8: కేవీకే సహకారంతో భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, బయోకల్చర్స్ తయారీపై విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం దృష్టి సారించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు అన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగపు సువాస ది స్టూడెంట్ క్లబ్ తరపున ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్ తయారీపై శిక్షణ, వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఐటీ రంగంపై ఆధారపడకుండా ప్రకృతి, ఆదునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో దాదాపు 30 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు తెలిపారు. ముఖ్యంగా పంట పోషణకు, రక్షణకు సంబంధించి 22 రకాల బయోకల్చర్స్‌ను ఏవిధంగా తయారు చేసుకోవాలో ప్రదర్శనగా చూపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, నన్నయ వర్సిటీ వృక్ష శాస్త్ర విభాగం ఆచార్యులు వి.పద్మావతి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల కోర్స్ కోఆర్డినేటర్ కె.సామ్యూల్‌కుమార్ ఎల్.ముత్యాలనాయుడు, కేవీకే అధికారులు జీవీఆర్ సత్యవాణి, దిలీప్, విజయ్‌వర్ధన్, ప్రభాత్‌నాయుడు, ఎంఏ రాజు, రత్నాజీ ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి

విద్యార్థులు, అధ్యాపకులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమాజ హితంగా జీవించాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బీసీడీఈ కళాశాలల కోఆర్డినేటర్‌లకు, స్టూడెంట్ అంబాసిడర్లకు అవగాహన కల్పించి విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీడీఈ కార్యదర్శి సీఈవో ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్, కన్సల్టెంట్ కె.సిమ్రాన్, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, బీసీడీఈ యూనవర్సిటీ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

టీవీ సీరియల్‌లో అవకాశం ఇప్పిస్తామని వ్యభిచార రొంపిలోకి..

దంపతులకు ఏడేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): టీవీ సీరియల్‌లో నటిగా అవకాశం కల్పిస్తామని మాయమాటలు చెప్పి ఒక మహిళను నిర్బంధించి అత్యాచారం, వ్యభిచారం చేయించిన కేసులో భార్యాభర్తలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్ శ్రీనివాసనగర్‌కు చెందిన లంక చమక్క, లంక నాగరాజు దంపతులు ఒక మహిళకు టీవీ సీరియల్‌లో అవకాశం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ చోట నిర్బంధించారు. నాగరాజు ఆమెపై అత్యాచారం చేశాడు. పాలలో మత్తు పదార్థాలు కలిపి తాగించి వ్యభిచారం చేయించారు. బాధిత మహిళ ఫిర్యాదుతో 2021 నవంబరు 13న ప్రకాశ్‌నగర్ సీఐ ఆర్‌జే రవి కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీశ్ వచ్చిన తర్వాత స్పీడీ ట్రైల్ పేరుతో విచారణలో ఉన్న కేసులను వేగవంతం చేసే చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయ్‌పాల్ స్వీయ పర్యవేక్షణలో ప్రకాశం నగర్ ప్రస్తుత సీఐ కేవీఎస్ సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడిపై నేరం రుజువు చేయడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ, సీఐతో పాటు కోర్టు హెచ్‌సీ పి.కొండలరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు.

లోక్ అదాలత్‌లో రెవెన్యూ కేసులు అధిక సంఖ్యలో పరిష్కారమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించిన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావడానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని రెవెన్యూ అధికారులతో ఆమె గురువారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందే కేసులకు కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇరుపక్షాలకు అంగీకారమైన పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి రాజీకి అర్హమైన కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. జీపీ సీహెచ్‌వీ ప్రసాద్, ఏజీపీ సీపీఆర్ రెడ్డి, కేఆర్ ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, కార్యదర్శులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి కేరళకు చెందిన వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి8: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేరళకు చెందిన అఖిల్‌జార్జ్ (24) విశాఖపట్నం క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చి తిరిగి వెళుతుండగా ఈ నెల 3,4 తారీఖుల్లో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అన్నవరం రావికంపాడు మధ్య జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మృతదేహం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా మారిందని కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ షేక్ అబ్దుల్‌మారుఫ్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 8: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు గురువారం ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై కలెక్టర్ అవగాహన కల్పించారు. ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సరళిపై 66 పేజీల హ్యాండ్ బుక్ రూపొందించినట్లు తెలిపారు. ఎన్నికలు జరిగే రోజున ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సెక్టారు అధికారులకు ఎన్నికల సరళిపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఏడు పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టారు అధికారిని నియమించినట్లు తెలిపారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు వీవీ రమణ, చెల్లయ్య, సువర్ణ, ఫణి, పీఎస్ కుమార్, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మరిడమ్మ ఆలయ ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, ఫిబ్రవరి 8: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురువారం లెక్కించారు. దేవస్థానం ఏసీ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. 180 రోజుల కాలానికి రూ.6,07,435 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేరీమాత ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక హాల్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుణదలలోని మేరీమాత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ రామవరప్పాడులో పలు రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక స్టాప్ సదుపాయం కల్పించింది. రైలు నెం.17479 పూరి-తిరుపతి, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 17480 తిరుపతి-పూరి, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను రామవరప్పాడులో నిలుపుదల చేస్తారని విజయవాడ డివిజన్ ప్రజా సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం మంద్రూప్‌కర్ తెలిపారు. భక్తులు గమనించాలని ఆమె కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

సోదరుడి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పిఠాపురం, ఫిబ్రవరి 8: పిఠాపురం పట్టణంలో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అతని సోదరుడు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో నివాసముంటున్న అనుపోజు శివ(29), అతని భార్య సుధారాణికి మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి తమ్ముడు దత్తకు ఫోన్ చేసి బయటకు వెళదామని చెప్పడంతో ఇద్దరు కలిసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి దత్త ఇంటికి వెళ్లిన కొంత సమయానికి శివ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో అన్నయ్య ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికే శివ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో భార్య సుధారాణి ఇంటి వద్ద లేదని చెబుతున్నారు. కాగా తన సోదరుడు శివ మృతిపై అనుమానాలు ఉన్నాయని దత్త పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాడి నరసింహారావుకు మాతృ వియోగం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 8: తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, తాడి నరసింహారావు మాతృమూర్తి, సినీ నిర్మాత, ప్రముఖ వ్యాపారవేత్త తాడి తాతారావు సతీమణి పొన్నమ్మ(70) బుధవారం రాత్రి మృతిచెందారు. పొన్నమ్మకు నరసింహారావు, జానకీరామ్ కుమారులు కాగా, కుమార్తె రమణీకుమారి ఉన్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన పొన్నమ్మ స్వగృహంలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. పొన్నమ్మ భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. నరసింహారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, పేరాబత్తుల రాజశేఖర్, అర్థాని శ్రీనివాస్, దొమ్మేటి రమణకుమార్, గోదశి పుండరీస్, కట్టా సత్తిబాబు, దూడల స్వామి, ములపర్తి బాలకృష్ణ, దాట్ల బాబు, కడలి నాగు, అడబాల సతీష్, మెండి కమల చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, కురసాల శివబాలు, గొల్లపల్లి గోపి తదితరులు ఉన్నారు. అలాగే పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పరామర్శిస్తున్న నేతలు

మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 8: రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో కొత్తగా మంజూరైన రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం మెడికల్ కాలేజీలు, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్ నాలుగు పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు పి.పద్మాశశిధర్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 20 పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలన్నారు.

https://eastgodavarai.ap.gov.in
https://kakinada.ap.gov.in,
https://konaseema.ap.gov.in,
https://eluru.ap.gov.in,
https://westgodavari.ap.gov.in,
https://krishna.ap.gov.in,
https://ntr.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందుపరిచామని తెలిపారు.

నర్సరీని సందర్శించిన నటుడు శ్రవణ్



కడియం, ఫిబ్రవరి 8: టాలీవుడ్ దిగ్గజ నటులు నటించిన చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్రలను పోషించిన నటుడు శ్రవణ్ గురువారం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. దేశ, విదేశాల మొక్కలతో కడియం నర్సరీలు శోభాయమానంగా ఉన్నాయని శ్రవణ్ అన్నారు.

నేడు 'రాజమహేంద్రి'లో సైన్స్ కళాజాత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8: రాజమహేంద్రి మహిళా కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటలకు సైన్స్ కళాజాతా నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, జిల్లా కార్యదర్శి వై.వైడియ్య, రవిబాబు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.కళాజాతాలో పాటలు, సైన్స్ నాటికలు, లఘు నాటికలు, నృత్యాలు, మ్యాజిక్ ప్రదర్శన ఉంటాయన్నారు.

ఏజెన్సీ సమాచారం

మధ్యాహ్న భోజనానికి అడ్డంకులు


ఎంఈవో ఆఫీస్‌లో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కూనవరం, ఫిబ్రవరి 8: పాఠశాలలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న జగన్ ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా అందించలేకపోతోంది. గత నాలుగు నెలలుగా మండలంలోని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం సరఫరా కావడం లేదు. దీంతో ఉపాధ్యాయులే తమ జేబులో డబ్బులు ఖర్చుపెట్టి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. దీనిపై అనేకసార్లు ఎంఈవోను కలిసినా ప్రయోజనం లేకుండా పోతుందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. తమ చేత వేలిముద్రలు సైతం వేయించుకున్నారని, బియ్యం సరఫరా చేస్తున్నట్లు లెక్కల్లో చూపుతున్నారని బియ్యం సరఫరా చేయకపోయిన పాఠశాలలో ఎక్కువ స్టాకు ఉన్నట్లు రికార్డులో నమోదు చేస్తున్నారన్నారు. కాని పాఠశాలలో ఒక్క బియ్యం గింజ కూడా లేకుండా పోతుందని వారు ఆరోపించారు. దీనిపై ఎంఈవో బాలరాజును అడగగా ఎక్కడైనా పక్క పాఠశాలలో బియ్యం ఉంటే అప్పు తెచ్చుకోమని వాట్సాప్ ద్వారా తమకు మెసేజ్ పెడుతున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

గిరిజన ప్రాంతాల్లో ఆలయ అభివృద్ధి పనులు

దేవీపట్నం, ఫిబ్రవరి 8: గిరిజన గ్రామాల్లో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లో కూడా ఆలయ అభివృద్ధి పనులకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో పండుగలు చాలా అద్భుతంగా ఉంటాయని కొత్తపప్పు, భూదేవి పండుగ, గంగాలమ్మతల్లి పండుగలను గిరిజనులంతా కలిసి జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ముసినిగుంట గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం నిమిత్తం ఇటుక, ఐరన్, సిమెంట్ అందజేశామన్నారు. 43 గ్రామాల్లో నిర్జీవంగా ఉన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథరావుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీకి ఉచిత కోచింగ్ ఇవ్వాలి

దేవీపట్నం, ఫిబ్రవరి 8: టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఐటీడీఏ ద్వారా ఉచిత కోచింగ్ ఇవ్వాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ గురువారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులకు రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇస్తూ భోజన, వసతి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆశావర్కర్లను అడ్డుకున్న పోలీసులు

దేవీపట్నం, ఫిబ్రవరి 8: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. గురువారం 51 మందితో బయలుదేరిన ఆశావర్కర్లను దేవీపట్నం పోలీసులు ఫజుల్లాబాద్‌లో అడ్డుకుని పెద్దభీంపల్లిలో ఉన్న దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి నిర్బంధించారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కరించకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని ఆశా వర్కర్లు, నాయకులు చెబుతున్నారు. తమను అరెస్టు చేయడం అన్యాయమని తమ నాయకులకు ఎక్కడో నిర్బంధించి అక్రమ అరెస్టులు చేయించడాన్ని ఖండించారు. రాబోయే ఎన్నికల్లో తామేంటో బ్యాలెట్‌తో రుజువు చేస్తామన్నారు.

ఏజెన్సీలో 21,448 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



రంపచోడవరం, ఫిబ్రవరి 8: ఏజెన్సీలో రైతులు పండించిన ధాన్యాన్ని 45 కొనుగోలు కేంద్రాల ద్వారా 21,448 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. గురువారం ఆయన కార్యాలయ చాంబరులో మాట్లాడుతూ 11 మండలాల్లోని ఎంపిక చేసిన రైతు భరోసా కేంద్రాలలో రూ.46.82 కోట్లతో 21,448 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు రూ.25.51 కోట్లు రైతులకు చెల్లించామని, ఇంకా రూ.21.31 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు.

బుగ్గన బడ్జెట్ అంకెల గారడీ

రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



రంపచోడవరం, ఫిబ్రవరి 8: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ అని అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంత అని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్య లోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనకే దక్కుతుందన్నారు. పన్నుల బాదుడే తప్పా బడ్జెట్‌లో కొత్త అంశాలు లేవని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ప్రతి స్కీము స్కాంగా మారిందని ఆరోపించారు. మద్యంతో వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తోందని, పేరుకే బీసీ సంక్షేమమని వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లాయన్నారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 8: గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు పల్లాల లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. వరి, జొన్న, మొక్కజొన్న కంది, మినుము, జనుము, జీడిమామిడి పిక్కలు తదితర పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. చింతపండు కిలో రూ.250లు, జీడిమామిడి పిక్కలు కేజీ రూ.250లు, పసుపు కేజీ రూ.250లు నిర్ణయించి కొనుగోలు చేయాలన్నారు.


స్వాగతం పలుకుతున్న వ్యవసాయశాఖ జేడీ మాధవరావు

ఉమ్మడి 'తూర్పు'లో వ్యవసాయ సలహాదారు పర్యటన

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం విచ్చేశారు. రెండు రోజులపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన తిరుపాల్‌రెడ్డిని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తిరుపాల్‌రెడ్డి శుక్రవారం సామర్లకోట, పిఠాపురం, ద్రాక్షారామ, అయినవిల్లి, అంతర్వేది పుణ్యక్షేత్రాలను సందర్శించి పనిలో పనిగా ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడానికి వచ్చినట్టు తెలిసింది. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, పీఏస్ వీరారెడ్డి, ఏఈవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.వేణుమాధవరావు, పీటర్ పాల్గొన్నారు.

మాట తప్పి మడం తిప్పిన జగన్

- సంపూర్ణ మద్యపాన నిషేధం ఏమైంది?
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

రంగంపేట, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో ఎన్నికల ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని మహిళలతో చెప్పిన జగన్ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి మడమ తిప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. గురవారం రాత్రి మండలంలోని నల్లమిల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు మద్యపానం నిషేధం చేయకుండా పనికిమాలిన బ్రాండ్‌ల పేరుతో మద్యాన్ని తీసుకొచ్చారన్నారు. అలాగే అధికారంలోకి వచ్చాక కరెంటు బిల్లులు పెంచనన్న జగన్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజలు రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేసే టీడీపీ-జనసేన కూటమికి అఖండ విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఓ దుర్మార్గుడిని గద్దె దింపడానికి ఉమ్మడిపోరు అవసరమని, వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతో టీడీపీ జనసేన పొత్తు కుదుర్చుకున్నారన్నారు. అనంతరంనల్లమిల్లిలో చింతలపూడి పోతురాజు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 100 కుటుంబాల సభ్యులు టీడీపీలో చేరారు. వారందరికీ రామకృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి తనయుడు మనోజ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, సీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, బాబా, సిరసపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాస్, చింతలపూడి పోతురాజు, చింతపూడి రాము, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ డ్రామాలు బయటపడుతున్నాయి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 8: గత ఎన్నికల్లో సానుభూతి పొందేందుకు జగన్ ఆడిన నాటకాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎట్టకేలకు కోడికత్తి శ్రీనుకు బెయిల్ రావడంపై గన్నికృష్ణ హర్షం వ్యక్తం చేశారు.జగన్ గత ఎన్నికల్లో ప్రజల సానుభూతి కోసం కోడికత్తి డ్రామాలు ఆడినట్టు ఇప్పుడు ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. ఐదేళ్ల పాటు కోడి కత్తి శ్రీను జైలు శిక్ష అనుభవించేలా జగన్ రెడ్డి కుట్రలకు పాల్పడ్డారన్నారు. జగన్ తాను ఆడిన డ్రామాలకు రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవడం ఖాయమన్నారు.

కొమరిపాలెంలో టీడీపీలోకి చేరికలు

బిక్కవోలు, ఫిబ్రవరి 8: కొమరిపాలెంలో వైసీపీకి చెందిన 50 మంది గురువారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో పందిరి గోవిందు, దంగేటి బుల్లబ్బాయి, పి.రాజు, సత్యవరపు వెంకటరాజు, డి.దుర్గ, మందపల్లి లక్ష్మి, వానపల్లి రాము, కె.దుర్గమ్మ, జె.బీబీ, షేక్ హిమాంబీ, అబ్దుల్లా తదితరులున్నారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, డీవీఆర్, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి శ్రీనివాసరావు, వెంకటరామారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామంలో తెలుగు మహిళలు మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో జుత్తుగ సూర్యకుమారి, సత్యగౌరి, సిరసపల్లి లక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి వాసు


రంగంపేట: నల్లమిల్లిలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

రోడ్లు ఇరుకుచేసి రంగువేస్తే అభివృద్ధా?: ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ ఫిబ్రవరి 8: రాజమహేంద్రవరంలో రోడ్లు ఇరుకు చేసి రంగు వేసి అభివృద్ధి అని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 7వ డివిజన్‌లో గురువారం మాజీ కార్పొరేటర్ కోరుమిల్లి విజయశేఖర్ ,మహిళా నాయకులు సయ్యద్ అప్సరి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసీపీకీ ఇంకో అవకాశం లేదన్నారు. ఇప్పటికే అవకాశం ఇచ్చిన ప్రజలు చాలా బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం 5వ డివిజన్ కంబాలపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాన్ని ఆదిరెడ్డి శ్రీనివాస్ పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

11న దళిత సింహగర్జన


దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 8: రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ఈనెల 11న అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ నిర్వహిస్తున్న దళిత సింహగర్జన సభకు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని దళిత నాయకులు ఎర్రా రామకృష్ణ, తాళ్ళూరి విజయకుమార్, కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి దళితులకు అన్యాయం చేశాడన్నారు. 11న జరిగే దళితుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో తాడేపల్లి ప్రసాద్, ఉసురుమర్తి ఆనంద్, టి.అరుణ్, ధార వరప్రసాద్, మోర్త అబ్బులు, మోతా చినబాబు, అరుణ్ బాబు, కొమరపు మనోజ్ పాల్గొన్నారు.

కాపునాడు మద్దతు..

దళితసింహ గర్జన సభకు కాపునాడు పూర్తి మద్దతు ప్రకటిస్తుందని సంఘం జేఏసీ మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి వెంట్రప్రగడ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడకు చెందిన నేత నాగబాబు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు గుదె రఘునరేష్, జామి సత్యనారాయణ, రామినీడి మురళీ మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో దళితులకు జరిగిన అన్యాయంపై హర్షకుమార్ చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతును ప్రకటిస్తున్నామన్నారు. సమావేశంలో కాపునాడు జేఏసీ నాయకులు వైశ్రీను, దాసరి గురునాథం, నామ సత్యనారాయణ, విన్నా వాసు, ప్రసాద్, చొడిశెట్టి పల్లంరాజు పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్ నిర్వహణకు చర్యలు

- నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాస్.. సమస్యాత్మక గ్రామాల పరిశీలన

కోరుకొండ, ఫిబ్రవరి 8: ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపడతామని నార్త్‌జోన్ డీఎస్పీ ఎ.శ్రీనివాస్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నార్త్‌జోన్ పరిధిలో పలు సమస్యాత్మక గ్రామాలను ఆయన పరిశీలించారు. దీనిలో భాగంగా కోరుకొండ మండలంలోని కోటి, కోటికేశవరం, గరగలంపాలెం, బొల్లెద్దుపాలెం, రాఘవాపురం, శ్రీరంగపట్నం గ్రామాల్లో పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల ఎలాంటి అలజడులకు తావులేకుండా ముందుగానే సమస్యాత్మక గ్రామాలు, నార్మల్ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. కోరుకొండతో పాటు రాజానగరం, సీతానగరం, గోకవరం మండలాల్లోని సమస్యాత్మక గ్రామాలను పరిశీలించనున్నట్టు డీఎస్పీ చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ జి.ఆనంద్‌కుమార్, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.


కడియం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు రమాదేవి


కోరుకొండలో ఓ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసు

దుళ్ల, వీరవరంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

కడియం, ఫిబ్రవరి 8: మండలంలోని దుళ్ల, వీరవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహశీల్దారు రమాదేవి, ఎస్ఐ బి.తులసీధర్, ఎంపీడీవో రాజ్‌మనోజ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, ర్యాంపులు, టాయిలెట్స్ విద్యుత్ వంటి సదుపాయాలు ఉండేలా చూడాలని వీఆర్వోలకు రమాదేవి సూచించారు. కార్యక్రమంలో దుళ్ల వీఆర్వో బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో ఆశావర్కర్ల నిర్బంధం

అనపర్తి, ఫిబ్రవరి 8: తమ డిమాండ్ల సాధనకు గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరిన అనపర్తి, బిక్కవోలు మండలాల ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తెల్లవారు జామున చలో విజయవాడకు వెళ్లేందుకు అనపర్తి, బిక్కవోలు మండలాల నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న 36మంది ఆశావర్కర్లను సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు అరెస్టు చేసి వర్తక సంఘ కల్యాణ మండపానికి తరలించారు. యూనియన్ నాయకురాలు లలిత మాట్లాడుతూ కరోనా సమయంలో తాము చేసిన సేవలకు కూడా విలువ ఇవ్వకుండా తమను అక్రమంగా నిర్బంధించడం దారుణమన్నారు. కనీసం వేతనం అమలు చేయక, సంక్షేమ పథకాలకు నోచుకోకుండా తమ కుటుంబాలు ఎలా బతకాలని ఆమె ప్రశ్నించారు. మధ్యాహ్నం 3గంటల వరకు నిర్బంధంలో ఉంచిన పోలీసులు సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

25 మద్యం సీసాలు స్వాధీనం

అనపర్తి, ఫిబ్రవరి 8: అనపర్తిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు. అనపర్తిలోని రామారెడ్డి పెట్రోలు బంకు సమీపంలో కొప్పవరం వెళ్లే పుంత రోడ్డులో మద్యం విక్రయాలు జరుగుతున్నా యన్న సమాచారంతో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన సింగవరపు పాపారావు 25 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

కడియం, ఫిబ్రవరి 8: మండలంలోని దుళ్ల-మురమండ రోడ్డులో ఉన్న నర్సరీలో కొందరు పేకాడుతున్నట్టు వచ్చిన తమకు సమాచారం మేరకు ఎస్ఐ బి.తులసీధర్, హెచ్‌సీ సీహెచ్ వెంకటరమణ, సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,240 నగదు, 8 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు, 52 పేకముక్కలు స్వాధీన పరుచుకున్నట్టు పోలీసులు తెలిపారు.

భర్తను భార్యకు అప్పగించిన పోలీసులు

కడియం, ఫిబ్రవరి 8: అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్తను పోలీసులు భార్యకు అప్పగించారు. మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన కాసాని ఈశ్వరి, సరికొండ నరేంద్రరాజు భార్యాభర్తలు. వారిద్దరూ ఇటీవల గొడవపడ్డారు. దీనితో నరేంద్రరాజు తనపై అలిగి గత ఏడాది సెప్టెంబరు 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడంటూ ఈశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నరేంద్రరాజు విశాఖపట్టణంలో ఉన్నట్టు గుర్తించారు. ఈ నెల 7న విశాఖపట్టణం వెళ్లి అతడిని తీసుకొచ్చి ఈశ్వరికి అప్పగించినట్టు ఎస్ఐ బి.తులసీధర్ తెలిపారు.

11న గాదరాడలో మహాచండీ హోమం

కోరుకొండ, ఫిబ్రవరి 8: మండలంలోని గాదరాడలో ఈ నెల 11న శ్రీ లక్ష్మీగణపతి రుద్ర సహిత మహాచండీయాగాన్ని నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ హోమానికి జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కడియం ఈవోపీఆర్‌డీగా విక్టర్‌బాబు

కడియం, ఫిబ్రవరి 8: కడియం ఈవోపీఆర్‌డీగా విక్టర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నుంచి బదిలీపై కడియం వచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మనోజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కాళహస్తీశ్వరావుకు స్వర్ణసింహ తలాట సత్కారం

కడియం, ఫిబ్రవరి 8: చీరాల ఆమోదగిరి పట్నంలో జరిగిన దేవబ్రాహ్మణ(దేవాంగ) అర్చక, పురోహిత, పండిత పరిషత్ తృతీయ సర్వసభ్య సమావేశంలో కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి దొంతంశెట్టి కాళహస్తీశ్వరరావుకు స్వర్ణసింహ తలాట సత్కారం జరిగింది. ఆయన చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలకు గాను చీరాలకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి సిద్ధి బుచ్చేశ్వరరావు దంపతులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో దేవాంగ అర్చక, పురోహిత, పండిత పరిషత్ అధ్యక్షుడు చల్లా రామారావు, దొంతంశెట్టి వీరబాబుసిద్ధాంతి, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు, పుచ్చల రామకృష్ణ, బండ్ల తిరుమల దేవి, సజ్జ హేమలత పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌పై అవగాహన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా నిర్వహించే ప్రాక్టికల్స్‌కి సంబంధించి ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు ప్రక్రియపై శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షకులు, పరీక్షల కన్వీనర్ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రక్రియను వివరించారు. తూర్పుగోదావరి, రంపచోడవరం, చింతూరు డివిజన్ల నుంచి సైన్సు అధ్యాపకులు, డీఈసీ సభ్యులు హాజరయ్యారు. ప్రయోగ పరీక్షలు నిర్వహించే విధానంపై వృక్ష, భౌతిక, రసాయన, జంతుశాస్త్ర సీనియర్ అధ్యాపకులు అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట, ఫిబ్రవరి 8: జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు కొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల రీత్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో జి.దొంతమూరు, వీరంపాలెం, పాకలు, బాలవరం గ్రామాల్లోను, వ్యవసాయ బోరులకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తామని చెప్పారు.

మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడదాం

జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీఖ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకుందామని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీఖ్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్, మద్యానికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. జాతీయ నేరగణాంకాల నివేదిక ప్రకారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మద్యపానం వల్ల 2021లో రాష్ట్రంలో 8067 మంది ఆత్మహత్య కేసులు నమోదయ్యాయన్నారు. ఈ జాబితాలో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనపై ఈ నెల 8నుంచి 18వ తేదీ వరకు చైతన్యవంతమైన కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్, ఐవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కలీముల్లాఖాన్, జమాతే సభ్యులు అల్లాఉద్దీన్, ఫీరోజ్, జైద్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

కలెక్టర్ మాధవీలత


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8: పిల్లల్లో వచ్చే జన్యుపరమైన సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం సాయంత్రం సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని, ఈ వ్యాధికి చికిత్స ఉందన్నారు. ప్రధానమంత్రి జనాజాతి ఆదివాసీవాస న్యాయమహా అభియాన్ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో, కుటుంబాల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఏస్ జ్యోతి, వైద్యాధికారిణి డాక్టర్ వసుంధర, అధికారులు పాల్గొన్నారు.

పేరివిజన్ చేయాలి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

బిక్కవోలు, ఫిబ్రవరి 8: పేరివిజన్ చేసి పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఎం.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం బుధవారం రాత్రి ఎంపీపీ మెయిన్ పాఠశాలలో జరిగింది. మండలాధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా డి.సురేంద్రకుమార్, ఆర్థిక కార్యదర్శిగా బి.దుర్గారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జాకబ్, జిల్లా అధ్యక్షుడు జే.డేనియల్‌బాబు, ఎస్టీయూ నాయకులు వి.భామిరెడ్డి, పి.చంద్రశేఖర్, టి.ఈశ్వరరెడ్డి, వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

12న రంగంపేట మండల పరిషత్ సమావేశం

రంగంపేట, ఫిబ్రవరి 8: రంగంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు గురువారం ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని చెప్పారు.

డ్రైవర్లు అప్రమత్తతో బస్సులు నడపాలి

ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8: డ్రైవర్లు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, తద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని రవాణాశాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.సబిత, పీవీవీడీ సాయికుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ట్రైనింగ్ స్కూల్‌లో ఆర్టీసీ డ్రైవర్లకు డ్రైవింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ డ్రైవర్లు ఏ విధంగా తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలో తెలియజేశారు. ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిల ఆశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: లాల్‌సలామ్
సూర్యామినీ	: ఈగల్
సూర్యాప్యాలస్	: తేరీ బాతోన్ మేరీ ఐసా
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: ఈగల్
అశోక	: ఈగల్
ఊర్వశి	: యాత్ర-2
రంభ	: ఈగల్
మేనక	: నా సామి రంగ
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
వీఎస్ మహాల్(నామవరం)	: ఈగల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: యాత్ర-2
వెంకటసూర్య(కడియం)	: ఈగల్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
రామకృష్ణ(కోరుకొండ)	: హనుమాన్
గీతాసినిమాస్ (సీతానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
లలితామహాల్(రంపచోడవరం)	: ఈగల్
నవయుగ(చింతూరు)	: ఈగల్



విశాఖలో ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 : ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన 114 మంది క్రీడాకారుల బృందం గురువారం రాష్ట్రస్థాయి పోటీలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లినట్టు జేసీ తేజ్‌భరత్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానం నుంచి బస్సుల్లో క్రీడాకారులు వెళ్లారని, జిల్లా తరఫున మొత్తం ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు.





ఆగ్రహావేశం..

- ఆశ కార్యకర్తల చలో విజయవాడ భగ్నం
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- జిల్లాలో 2500 మంది కార్యకర్తలు
- పలు చోట్ల 300 మంది అరెస్టు
- సీఎం జగన్ తీరుపై అసహనం
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- 12 డిమాండ్ల సాధనకు పోరాటం

సర్కారుపై ఆశా వర్కర్ల మండిపాటు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లు పిడికిలి బిగించారు..సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు.. జగన్‌ను గద్దె దింపుతామంటూ ప్రతినబూనారు. నిత్యం ప్రజల మధ్య ఉండే ఆశావర్కర్లకు కనీస జీతాలు కూడా ఇవ్వకపోవడంతో ఆందోళన బాటపట్టారు. ఛలో అసెంబ్లీ పేరుతో అసెంబ్లీని ముట్టడికి రోడ్డెక్కారు. ఎక్కడికక్కడ నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా ఎవరూ జంకగుండా పోలీసుల ఎదుటే సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేసి తిరుగుబావుటా ఎగరవేశారు. కనీస వేతనంతో పాటు 12 డిమాండ్ల సాధనకు ఆందోళన బాటపట్టారు. జిల్లాలో సుమారు 2500 మంది ఆశావర్కర్లు ఉన్నారు. వీరికి నెలకు వచ్చే జీతం రూ.10 వేలు మాత్రమే. అందులో కొంత కేంద్రం, కొంత రాష్ట్రం ఇస్తుంది. కానీ వీరికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాల వద్ద విధులు కేటాయిస్తున్నారు.ఇతర పనులకు ఉపయోగిస్తున్నారు. ఉదయం , సాయంత్రం కూడా రిజిష్టర్‌లో సంతకాలు చేయించుకుంటున్నారు. ప్రజలకు ఇంత సేవ చేస్తున్నా కనీసం వేతనం, ఇతర సౌకర్యాలు లేక ఆశావర్కర్లు నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. కొంత కాలం కిందట రంపచోడవరంలో నిరసనలు తెలిపారు. ఇవాళ సీఐటీయూ పిలుపు మేరకు ఛలో విజయవాడకు కదిలారు.

వారి డిమాండ్‌లు ఇవే

కనీస వేతనాలు పెంచాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలి. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిని మెటర్నిటీ లీవ్ అమలు చేయాలి.సంబంధంలేని పనులు చేయించరాదు. నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలి. శిక్షణ ఇవ్వాలి. రికార్డ్స్ ప్రభుత్వమే ఇవ్వాలి. రికార్డ్సు లేదా ఆన్‌లైన్ పనివిషయంలో ఒక పనిని ఒకసారే చేయించాలి. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ఏ కారణంతో మరణించినా మట్టి ఖర్చులు ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలి. 62 ఏళ్ల రిటైర్మెంట్ జీవోను వర్తింపజేయాలి. రిటైర్మెంట్ అయిన వారు, మరణించిన వారి కుటుంబాలలో అర్హులను ఆశాలుగా తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. కొవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి. రూరల్‌లో 1000 నుంచి 1200 మంది. పట్టణాల్లో 2000 నుంచి 2500 మంది జనాభాకు ఒకరి వంతున నియమించాలి. ఏఎన్ఎం ట్రైనింగ్ ఇవ్వాలి. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి. నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి. రాజకీయజోక్యం తొలగించాలి. ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ పొందిన ఆశా వర్కర్లను ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీలు, స్టాఫ్ నర్స్ నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలి.

300 మంది అరెస్టు...

'చలో విజయవాడ' కార్యక్రమానికి బయలుదేరిన 'ఆశా' మహి ళలకు మళ్లీ అడుగడుగునా నిరాశే మిగిలింది. నిరసనకు అనుమతిలేదంటూ జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో తెల్లవారు జాము నుంచే పోలీసులు మోహరించారు. వాహనాలనూ తనిఖీ చేసిన పోలీసులు ఆశాలని అనుమానం వస్తే దించివేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ ఆశావర్కర్లు వైసీపీ ప్రభుత్వం మీద తిరుగుబావుటా ఎగరవేశారు. కనీస వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌తోపాటు మొత్తం 12 డిమాండ్లతో గురువారం ఛలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధం అయ్యారు. పోలీసులు అందరికీ నోటీసులు ఇవ్వడంతో పాటు, కొందరిని గృహనిర్బంధం చేశారు. నోటీసులను లెక్కచేయకుండా విజయవాడ బయలుదేరిన మహిళలను ఎక్కడికక్కడే ఆపేసి పోలీస్‌స్టేషన్లకు తర లించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు తూర్పుగోదావరితో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి గురువారం ఉదయం ఆశాలు చేరుకున్నారు.వాళ్లను రైళ్లు ఎక్కకుండా టూటౌన్, ప్రభుత్వ రైల్వే పోలీసులు అడ్డుకున్నారు. సుమారు 66 మంది ఆశాలను రైల్వే స్టేషను సమీపంలోని ఓ కల్యాణ మండపానికి తరలించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 300 మందికిపైగా ఆశా వర్కర్లను పోలీ సులు అరెస్టు చేశారు.సాయంత్రం వరకూ ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు కాపలా ఉన్నారు. ఇళ్లకు వెళతామని 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి వెళ్లబోమని ఆశాల దగ్గర నుంచి సంతకాలు తీసుకొని సొంత పూచీకత్తుపై పంపించేశారు.అయినా ఆందోళనకారులు లెక్కచేయలేదు. పోలీ సుల ఎదుటే సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆశా వర్కర్లు ఆందోళనకు దిగడంతో ప్రజలకు వారు అం దించే సేవలు ఆగిపోయాయి.



కొవ్వూరులో ఆశాల నిర్బంధం

కొవ్వూరులో హైవేపై అడ్డగింత

250 మందిని నిర్బంధించిన పోలీసులు

కొవ్వూరు, ఫిబ్రవరి 8 : వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆశా వర్కర్లు ప్రతినబూ నారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి విజయవాడ తరలివెళ్తున్న ఆశా వర్కర్లను కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనకాపల్లి, పార్వతీపురం, విశాఖపట్నం, నర్సీపట్నం, గోకవరం ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ తరలివెళ్తున్న మూడు టూరిస్ట్ బస్సులు, 1 తుఫాన్ వాహనం, రెండు మహీంద్ర ఆటోలతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరిన సుమారు 250 మంది ఆశా వర్కర్లను తెల్లవారుజామున 3,4 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్బంధించారు.చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అనుమతి లేదని వారందరిని తిరిగి వెనక్కి పం పించివేశారు. సానుకూలంగా నిరసన తెలపడానికి వచ్చిన మహిళలను మహిళా పోలీసులు లేకుండా మగ పోలీసులే నిర్బంధాలకు గురి చేయడం సరికాదన్నారు.

నిడదవోలు రైల్వే జంక్షన్‌లో..

నిడదవోలు, ఫిబ్రవరి 8 : ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా కార్యకర్తలు అడ గడంతో వారిని అక్రమ అరెస్ట్‌లు చేశారని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నిడదవోలు రైల్వే స్టేషన్ నుంచి గురువారం ఆశా కార్యకర్తలు చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతుండగా చాగల్లు, నిడదవోలు పట్టణ మండల గ్రామాలకు చెందిన సుమారు 40 మందిని పోలీసులు అరెస్ట్ చేసి సమీపంలోని తాలూకా రైస్ మిల్లర్స్ హాలుకు తరలించారు. అనంతరం పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై ఆశాలను విడుదల చేశారు.



జగన్‌కు బుద్ధి చెబుతాం..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8 : చలో విజయవాడకు బయలుదేరిన ఆశా వర్కర్లపై జగన్ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి చేపట్టిన అరెస్టులు, నిర్బంధాలకు వ్యతిరేకంగా గురువారం సాయంత్రం ఆశా వర్కర్లు రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్లో నిరసన ధర్నా చేపట్టారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కనీస వేతనం రూ.25 వేలు చెల్లించాలని, యాప్స్ పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తమకు వర్తింప చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ సచివాలయ పోలీసులను ఆశా వర్కర్ల ఇళ్లకు పంపించి వారిని పోలీస్టేషన్లకు తరలించడం దుర్మార్గమన్నారు. జగన్మోహనరెడ్డి ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు కురిపించారని, సీఎం అయ్యాక ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన గణపాఠం చెబుతాన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రాణి, జయలక్ష్మి పాల్గొన్నారు.



మేము ఎలా బతకాలి సారూ...

సీతానగరం,ఫిబ్రవరి 8 : మాకు నెలకు ప్రభుత్వం ఇచ్చే జీతం పది వేలు. ప్రభుత్వం అప్పగించిన పనులు చేయడానికి సగం జీతం అయిపోతోంది. 24 గంటలు పనిచేయాలని చెబుతున్నారు. ఇంక మేం ఎలా బతకాలి సార్.. అందుకే మా న్యాయమైన డిమాండ్ల సాధనకు ధర్నాకు వెళుతున్నాం.. మీరు అరెస్టు చేస్తే చేసుకోండి.. ఎక్కడికి తీసుకువెళతారో తీసుకెళ్లండి మేము మాత్రం ఎక్కడ ఉంటే అక్కడే మహాధర్నాకు సంఘీభావం తెలుపుతామని ఎస్ఐకు తెలిపారు. సీతానగరం మండల ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్యక్షురాలు కుమారి మాట్లాడుతూ ప్రభుత్వోగులమని మాకు అన్ని ప్రభుత్వ పథకాలు కట్‌చేశారు. మాకు ప్రభుత్వం నుంచి ఏవిధమైన లబ్ధి లేకుండా చేశారు. చేసిన పనికి సరిపడా జీతం కోరుతున్నాం. సీఎం జగన్‌కు ప్రజల గురించి ఆలోచించే సీఎం అయితే మా గురించి ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.



అనపర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఓటింగ్‌పై దృష్టి పెట్టండి

అనపర్తిలో కలెక్టర్ మాధవీలత

అనపర్తి, ఫిబ్రవరి 8 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునే విదంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత అన్నారు. అనపర్తి జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఎల్‌వోలు ఇతర ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. బీఎల్‌వో తన పోలింగ్ కేంద్రం ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి ఒక్క తప్పు లేకుండా జాబితాలోని పేర్లను నిర్ధారణ చేసుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెంచే క్రమంలో ఓటరు జాబితా కీలకమన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ విధులు నిర్వహించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం అనపర్తిలోని శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అదే పాఠశాలలో ఏర్పాటు చేసిన నెంబరు తొమ్మిది పోలింగ్ స్టేషన్‌కు పరిశీలించారు. అనపర్తి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు ఈ కేంద్రం నుంచే మెటీరియల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇదే పాఠశాలలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా సెక్టార్లు ఏర్పాటు చేసి ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు మెటీరియల్ అందజేస్తామన్నారు. రూట్ మ్యాప్ ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారు లను ఆదేశించారు. అదే పాఠశాలలో కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని ఇష్టంతో చదివితే విజయం వరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఆర్వో ఎం.మాధురి, ఈఆర్వోలు నాగరాజు నాయక్, డి సునీల్ కుమార్, లతీఫ్ బాషా, ఈఆర్వో టి రామచంద్రారెడ్డి, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు అధికారులు పాల్గొన్నారు.

85.76 ఎకరాలు.. రూ.12.26 లక్షలు

గోపాలపురం, ఫిబ్రవరి 8: శ్రీసీతారామస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయ భూములతో పాటు పెరుమాళ్ళ రెడ్డి సత్రం, శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ భూములకు దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు గురువారం కౌలు వేలం నిర్వహించారు.శ్రీ సీతారామస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయానికి 54.12 ఎకరాలు, పెరుమాళ్ల రెడ్డిసత్రం 20. 92 ఎకరాలు, శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి 10.72 ఎకరాలు మొత్తం 85.72 ఎకరాల భూమికి బహిరంగ వేలం నిర్వహించగా 35 మంది రైతులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నట్టు తెలిపారు. వారిలో 14 మంది రైతులు హెచ్చుపాట పాడి భూములు దక్కించుకున్నారన్నారు. 54.12 ఎకరాలకు గతేడాది రూ.7,75,500 పాటగా వెళ్లిందని ఈ ఏడాది రూ.8,75,500కు వెళ్లినట్లు తెలిపారు. 20.92 ఎకరాలకు గతేడాది రూ.1,39,500 ధర రాగా ఈ ఏడాది రూ.2,38,500, 10.72 ఎకరాలకు గత ఏడాది రూ.94 వేలు ఈ ఏడాది రూ.1,12,000 పలికిందన్నారు. మొత్తంగా రూ.12.26 లక్షల ఆదాయం సమకూరుతుందని ఆలయ ఈవో మీసాల నాగరాజు, వేలం ప్రక్రియ పర్యవేక్షణ అధికారి సృజన్ కుమార్ తెలిపారు.

నేడు చాగల్లులో షర్మిలరెడ్డి రచ్చబండ

చాగల్లు, ఫిబ్రవరి 8 : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి శుక్రవారం చాగల్లులో జరిగే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏ.అరుణకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పర్యటన వివరాలను వెల్లడించారు. ఉదయం 10 గంటలకు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. గత రెండు రోజులుగా పర్యటిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆమె చాగల్లు నుంచి బయలుదేరి కొవ్వూరు చేరుకుని యువరాజ్ ఫంక్షన్ హాల్‌లో కాసేపు బస చేస్తారు. అక్కడే భోజనం చేసి కాకినాడ బయలుదేరి వెళతారు. ఆమెతో పాటుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొంటారని అన్నారు.



కాకరపర్రు వద్ద ఏటిగట్టుపై నిలిపి ఉంచిన లారీలు

అక్రమంగా తరలిపోతున్న మట్టి, ఇసుక

- గోదావరి ఏటిగట్టుపై లారీల అడ్డగింత
- ఆందోళనకు దిగిన కాకరపర్రు గ్రామస్తులు
- పోలీస్ స్టేషన్‌కు లారీలు తరలింపు

పెరవలి,ఫిబ్రవరి 8 : కాకరపర్రు వద్ద అక్రమంగా ఇసుక మట్టి తరలిస్తున్న లారీలను గ్రామానికి చెందిన పలువురు గోదావరి ఏటిగట్టుపై అడ్డుకుని ఆందోళన చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా ప్రతి రోజూ వందలాది లారీల్లో ఇసుక మట్టి తరలిపోతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన కొంత మంది గురువారం రాత్రి ఏటిగట్టుపైకి వెళ్లగా అప్పటికే ఇసుక లోడు చేసుకుని వెళుతున్న లారీలను అడ్డుకుని నిలిపివేశారు. అనంతరం మరికొంత మంది వెళ్లి ఏటిగట్టుపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పురుషులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. తమ గ్రామ పరిధిలో అక్రమంగా తవ్వకాలు చేయడం వల్ల లంక భూములు కోతకు గురవుతాయని.. భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆరోపించారు. అక్రమార్కుల వల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతుందన్నారు.మట్టి తవ్వకానికి అనుమతులున్నాయని చెబుతున్నారని.. చూపించమంటే చూపించడం లేదని ఆరోపించారు. పెరవలి ఎస్ఐ మూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి నిలిపివేసిన లారీలను స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. ఆందోళనకారులు అడ్డుకుని సమస్య ఇక్కడే పరిష్కరించాలని పట్టుబట్టారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేసి అనుమతులు పత్రాలు పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు అంగీకరించారు. దీంతో లారీలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అంతర్మథనం

వైసీపీ నాయకుల్లో అయోమయం

- సీట్లిచ్చినా కానరాని ఉత్సాహం
- గోపాలపురంపై వనిత కినుక
- కొవ్వూరుపై తలారిది అదే మాట?
- బదిలీలపై చెప్పలేని బాధ
- ఇంకనూ తేలని రాజానగరం
- బి.ఫారం ఇచ్చే వరకూ నో గ్యారంటీ
- కేడర్ నోట ఇదే అనుమానం
- వైసీపీలో న..గరం..గరం
- రూరల్‌లో వేణు రూటు..సెపరేటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో వైసీపీ నాయకుల పరిస్థితి కక్కలేక మింగలేక అనే చందంగా తయారైంది. సిట్టింగులతోపాటు మరికొందరు ఆశావహులను నియోజకవర్గ ఇన్‌చార్జులుగా పార్టీ అధిష్ఠానం నియమిస్తున్నా వాళ్ల మోములో ఉత్సాహం మాత్రం కరువైందనే ప్రచారం సాగుతోంది. జగన్మోహనరెడ్డి ఆటలో పావులుగా మారిపోయామా? అనే 'అంతర్మథన'మే దానికి అసలైన కారమణమని వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిలను కొన్ని చోట్ల మార్పు చేసినా.. కొత్తగా ప్రకటించినా..రాజకీయ బదిలీలు చేసినా.. జగన్ ఆలోచనా సరళిని బట్టి నామినేషన్లు వేశాక గానీ సీటు ఖాయం కాదని ఆ పార్టీ నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. మరోవైపు టీడీపీ గ్రాఫ్ రోజు రోజుకూ పెరుగు తుండడంతో వైసీపీ పోటీదారులు తమ రాజకీయ జీవి తంపై పునఃపరిశీలనలో పడుతున్నారు.

సీట్లు.. తలపోట్లు..

హోంమంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం పంపించి, అక్కడ ఉన్న తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు.అయితే తాను కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గోపాలపురంలో తనకు ఎవరు ఓటేస్తారంటూ హోంమంత్రి తన అంతరంగికుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు తీసుకొచ్చినా ఆయనలోనూ అదే అసహనం ఉందని చెబుతున్నారు. ఈ పరిణామాలతో తానేటి వనిత సామాజికవర్గం నాయకులు అయోమయంలో ఉన్నారు. రాజానగరం ఎమ్మెల్యే, తూర్పుగోదావరి వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా తమ్ముడు జక్కంపూడి గణేశ్‌కు ఎమ్మెల్యే సీటు ఇస్తారనే ప్రచారం జరుగుతుండడంతో పాటు అలా చేస్తే రాజాకు సీటు దక్కుతుందా లేక ఫ్యామిలీ ప్యాకేజీ ఉంటుందా అన్న చర్చ కూడా నడుస్తోంది. జగన్ ఇప్పటి వరకూ విడుదల చేసిన జాబితాల్లో రాజానగరం స్థానంపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. కానీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజా తనపని తాను చేసుకుపోతున్నారు. గణేశ్‌కు రాజానగరం సీటు ఇస్తే రాజాను ఎంపీగా బరిలో నిలిపే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపించినా ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ని ప్రకటించడంతో ఆ అవకాశానికీ తెరపడింది. ఎంపీ భరత్‌రామ్‌కు ఎమ్మెల్యే రాజాకు మధ్య కోల్డ్‌వార్ ఈనాటిది కాదు. బ్లేడ్ బ్యాచ్‌ల విషయంలో ఇద్దరికీ వైరం నడుస్తూనే ఉంది. రాజా కుటుంబానికి సీట్లు కేటాయించే విషయంలో కూడా భరత్ ప్రమేయం ఉందనే ప్రచారం నడుస్తోంది.

గూడూరి సంగతేంటో..

డాక్టర్ గూడూరిని ఎంపీ భరత్ తన వ్యూహంలో భాగంగా పార్టీలోకి తీసుకొచ్చారనే వాదన ఉంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు నియోజకవర్గాలున్నా ముందు నుంచీ భరత్ రాజమహేంద్రవరం సిటీపైనే కన్నేశారు. మిగతా నియోజకవర్గాలను పెద్దగా పట్టించుకోలేదు. వాస్తవానికి గూడూరిని పార్టీ కార్యక్రమాల నిర్వహణ ఖర్చులకు తీసుకొచ్చారనే విమర్శలు గతం నుంచే పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇప్పుడు గూడూరిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వైసీపీ ఖర్చులకు గల్లాపెట్టె దొరికినట్లయిందని పార్టీలోని ఆయన వ్యతిరేకులు చెప్పుకుంటున్నారు.ఎంపీ భరత్ వ్యూహంలో గూడూరి పక్కాగా చిక్కుకున్నట్టు కనిపిస్తోందని ప్రచారం సాగుతోంది. మరోవైపు రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జి చందన నాగేశ్వర్‌కి మొండిచెయ్యి చూపించారు. రాష్ట్ర స్థాయి పదవి అంటూ గ్రీనరీ కార్పొరేషన్ చైర్మన్ గిరీ తాయిలం చూపించి.. తాను మొదటి నుంచీ ఆశ పెట్టుకున్న రూరల్ నియోజకవర్గంతో ఏ మాత్రం సంబంధంలేని మంత్రి వేణుని తీసుకొచ్చి కూర్చోబెట్టారు. దీంతో చందన నాగేశ్వర్ రూరల్‌లో తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎన్నికల కోసం రూపొందించుకున్న కేడర్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మంత్రి వేణు ఇప్పుడు రూరల్ కేడర్, ప్రజలతో పరిచయం పెంచుకొనే పనిలో ఉన్నారు. కానీ చందన నాగేశ్వర్‌కు చెందిన క్యాడర్‌ని కలుపుకోవడం లేదనే విమర్శలున్నాయి. పైగా వేణు కార్యక్రమాలకు వైసీపీ నాయకుల కంటే అధికార గణమే ఎక్కువగా ఉంటోంది. పంచాయతీ, రెవెన్యూ అధికారులపై ఖర్చు లను రుద్దేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మూడు పెద్ద కార్యక్రమాలకు ఎక్కువ మొత్తంలో జేబులకు చిల్లు పడడంతో అధికారులు తమ ఆవేదనను పంటిబిగువున అదిమిపట్టుకుంటున్నారని చెబుతున్నారు.

నామినేషన్ వేశాక గానీ?

ఇదంతా ఒకెత్తు అయితే జగన్ స్థిమితం లేని నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుంటే ఎమ్మెల్యేగా నామినేషన్ సమర్పించే వరకూ అభ్యర్థులుగా ప్రచారంలో ఉన్నవారిలో అయోమయం అలాగే ఉంటుందని పార్టీలో వాదనలు వినవస్తున్నాయి. ఎవరికి వారు ఎమ్మెల్యే అభ్యర్థులమంటూ హల్‌చల్ చేయడం మినహా బీఫాం ఇచ్చాక గానీ నిజనిర్ధారణ కాదని అంటున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఛైరపర్సన్‌గా మరోసారి అవకాశం లభిస్తుందని మేడపాటి షర్మిళారెడ్డి, ఆమె వర్గం భావించింది. చివరి దాకా వైసీపీ పెద్దలు అదే ఆశ కల్పించారు. దీనికి అనుగుణంగా రుడా ఛైర్‌పర్సన్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్టే ఇచ్చి దాన్ని రద్దు చేసి ఆ సీటులో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావును ఖరారు చేశారు. షర్మిళను హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా విజయవాడ పంపించేశారు. ఎంపీ భరత్‌కు షర్మిళకు మధ్య కొన్నాళ్లుగా రాజకీయ వైరం ఉంది. ఈ నేపథ్యంలో రౌతును పట్టుబట్టి ఇక్కడికి తీసుకొచ్చి షర్మిళను సిటీకి దూరం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి బలాన్ని చేకూర్చే విదంగా పోలీస్ కన్వెన్షన్ హాలులో డిసెంబరులో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఎంపీ కొన్ని వ్యాఖ్యలు చేశారు. రుడా అంటే ఏంటో ఇకపై చూపిస్తామంటూ గత రుడా పాలనను పరోక్షంగా విమర్శించారు. ఎంపీ వ్యూహంలో భాగంగానే షర్మిలను సిటీ నుంచి పంపించేసి రుడా చైర్మన్ గా రౌతు సూర్యప్రకాశరావును నియమింపజేసుకున్నారని జనం బలంగా నమ్ముతున్నారు. రుడా చేతిలో ఉండే అధికారాన్ని వాడుకొని ల్యాండ్ పూలింగ్ అంటూ తేలిగ్గా ఆస్తులు కూడబెట్టవచ్చనే ఆలోచనలో రౌతును పావుగా చేయడానికే ఇప్పుడు పదవిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇదేనా మహిళా సాధికారత..

ఇక మహిళల పట్ల వైసీపీ అధిష్ఠానం అనుసరిస్తున్న తీరు చూస్తుంటే నోటితో పొగుడుతూ నొసటితో వెక్కిరించిన చందంగా ఉందనే ఆవేదన మహిళా నేతల్లో వ్యక్తమవుతోంది. నా అక్కా చెల్లెమ్మలు అంటూనే జగన్ తమకు అన్యాయం చేస్తున్నారనే భావన ఉంది. పార్టీని నమ్ముకొని ఉన్న డాక్టర్ అనసూరి పద్మలతకు ఆశజూపి మోసం చేశారనే చర్చ పార్టీ వర్గాల్లో నలుగుతోంది. ముందు నుంచీ ప్రజల్లో ఉంటూ ఎంపీ సీటు తనదేనని అనుకొన్న తరుణంలో గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చి ఆ మహిళ కంట నీళ్లు పెట్టించారనే విమర్శలున్నాయి. మరోవైపు తానేటి వనిత స్థానాన్ని మార్పు చేసి ఆమెనూ ఇబ్బంది పెడుతున్నారని అంటున్నారు. రుడా ఛైర్మన్ పదవి మళ్లీ తనకే దక్కుతుందని మేడపాటి షర్మిల ఆశపడ్డారు. వైసీపీ పెద్దలు చైర్మన్ పదవిలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఆ వెంటనే రద్దు చేయడం ద్వారా ఆమెను కూడా ఇబ్బంది పెట్టారని చెబుతున్నారు. ఇలా, అన్ని రకాలుగా పార్టీలోని మహిళలను వైసీపీ నేతలు ఆ ణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారనే భావన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోందని చెబుతున్నారు.

నేడు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొవ్వూరు ఎంపీడీవో సుశీల

కొవ్వూరు, ఫిబ్రవరి 8: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఈ నెల 9న ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ఈ మేరకు కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు మాట్లాడుతూ 1నుంచి 19ఏళ్ల వయస్సు వారందరికి ఆల్బెండాజోల్ మాత్రలు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఆ రోజు మాత్రలు తీసుకోని వారికి ఈ నెల 16న మాప్ అప్ డే సందర్భంగా మాత్రలు అందజేస్తామన్నారు. దొమ్మేరు పీహెచ్‌సీలో 5760 మందికి మాత్రలు పంపిణీ చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ, ఎంఈవో జె.కెంపురత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చాగల్లులో కాంగ్రెస్ రచ్చబండ

కొవ్వూరు, ఫిబ్రవరి 8: ఈ నెల 9న చాగల్లు గ్రామంలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి హాజరవుతున్నట్టు కాంగ్రెస్ కొవ్వూరు అధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాహూజీ (బాబ్జి) తెలిపారు. గురువారం కొవ్వూరులో ఆయన మాట్లాడుతూ షర్మిలారెడ్డి రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆ రోజు ఉదయం 10గంటలకు కొవ్వూరు మండలం పంగిడి హైవే నుంచి మీనానగరం మీదుగా చాగల్లు చేరుకుంటారని, రచ్చబండ కార్యక్రమం ముగించుకుని నందమూరు మీదుగా కొవ్వూరు చేరుకుంటారన్నారు. భోజనం అనంతరం గామన్‌బ్రిడ్జి మీదుగా కాకినాడ జిల్లా తునిలో బహిరంగ సభకు తరలివెళ్తారన్నారు. షర్మిలారెడ్డి యాత్రకు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



నిడదవోలు, ఫిబ్రవరి 8: నిడదవోలులో బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి సందర్భంగా ఉదయం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీకాకోళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్ ఆధ్వర్యంలో స్వామికి నిత్యాభిషేకాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఈవో సోమాల శివ తెలిపారు.

రేపు రైళ్ల హాల్ట్ పునరుద్ధరణ కోరుతూ పాదయాత్ర

కొవ్వూరు, ఫిబ్రవరి 8: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ కారణంగా రద్దుచేసిన రైళ్లను తిరిగి హాల్ట్ కల్పించాలని రైల్వే పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర చేపట్టనున్నారు. 2019కి ముందు ఉన్న 36 హాల్ట్‌లో 24 రైళ్ల హాల్ట్‌లను ఏకపక్షంగా రద్దు చేయడంతో సామాన్యులు ప్రయాణ సౌకర్యానికి దూరమయ్యారు. దీనికి తోడు కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఓల్వా బస్సులను రద్దు చేయడంతో కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలు దూర ప్రాంత ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరులో 36 రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న 9 గంటలకు రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్, విజయవిహార్, లాంచీలరేవు, రోడ్డు కం రైలు బ్రిడ్జి మీదుగా రాజమహేంద్రవరం బస్టాండ్ మీదుగా ఎంపీ మార్గాని భరత్ కార్యాలయం, అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించనున్నారు.

చాగల్లులో పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎంపీడీవో

చాగల్లు, ఫిబ్రవరి 8: మండల కేంద్రమైన చాగల్లులోని పోలింగ్ కేంద్రాలను అధికారులు గురువారం పరిశీలించారు. తహశీల్దార్ సావిత్రి, ఎంపీడీవో బుజ్జి ఆధ్వర్యంలో అధికారులు పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఓటర్లు ఇబ్బంది లేకుండా తీసుకోవలసిన చర్యలు, ఇతర సమస్యలు గురించి పరిశీలించారు.

12న కొవ్వూరులో శతక పద్య సహస్ర గళార్చన

కొవ్వూరు, ఫిబ్రవరి 8: మాతృభాషా పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 12న కొవ్వూరులో శతక పద్య సహస్ర గళార్చన-వేమన శతకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీహెచ్‌వీఎస్ నాగభూషణం తెలిపారు. కొవ్వూరులోని పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో 40 పాఠశాలలకు చెందిన 1008 మంది చిన్నారులతో 108 వేమన పద్యాల రాగయుక్త ఆలాపన చేస్తారని చెప్పారు.

వైసీపీకి కాండ్రేగుల శ్రీహరి రాజీనామా

గోపాలపురం, ఫిబ్రవరి 8: మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, రైతు విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీహరి పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ప్రకటించారు. గోపాలపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కార్యకర్త స్థాయి నుంచి పని చేశానని, రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయనపై అభిమానంతో వైసీపీలో చేరి తొమ్మిదేళ్లు కష్టపడి పని చేశానని, అయితే పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామస్థాయిలో ఉన్న నాయకులను ఎమ్మెల్యే పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మండల రాజకీయాల్లో ముద్ర వేసుకుని సీనియర్ నాయకుడిగా ఉన్న తనకు కనీస విలువ ఇవ్వలేదన్నారు. పార్టీలో ఇమడలేక ప్రస్తుతం ఉన్న నాయకులతో కొనసాగలేక క్రియాశీల సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు స్పష్టం చేశారు. టీడీపీలో చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చాగల్లు, ఫిబ్రవరి 8: చాగల్లులో సారా విక్రయిస్తున్న మహిళను గురువారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. గ్రామంలోని పశివేదల వెళ్లే రోడ్డులో మట్ట మంగను అరెస్టు చేసి 5 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నామని, నిడదవోలు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

యాదవోలులో వ్యక్తి అనుమానాస్పద మృతి

దేవరపల్లి, ఫిబ్రవరి 8: దేవరపల్లి మండలం యాదవోలు జీడిమామిడి తోటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పిలకా వెంకటేశ్వరరావు (బుజ్జి) (48) కౌలుకు పండిస్తున్న జీడిమామిడి తోటలో ఆకులు తొలగించడానికి గురువారం ఉదయం 7గంటలకి వెళ్ళాడు. మధ్యాహ్నం 3గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య కుమారుడు పొలం వెళ్లి చూడగా జీడిమామిడి చెట్టు మొదలు వద్ద బోర్లపడి ఉన్నాడు. పరిశీలించి చూడగా మృతి చెంది ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని సీఐ రామకృష్ణ, ఎస్ఐ కె.శ్రీహరిరావు పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఏ విధమైన బలమైన గాయాలు లేవని, బోర్ల పడడం వల్ల ముఖంపై చిన్న గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కాగా వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



బుజ్జి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఫైల్‌ఫొటో

నేడు 'రాజమహేంద్రి'లో సైన్స్ కళాజాత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8: రాజమహేంద్రి మహిళా కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటలకు సైన్స్ కళాజాతా నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, జిల్లా కార్యదర్శి వై.వైడియ్య, రవిబాబు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.కళాజాతాలో పాటలు, సైన్స్ నాటికలు, లఘు నాటికలు, నృత్యాలు, మ్యాజిక్ ప్రదర్శన ఉంటాయన్నారు.


దేవరపల్లిలో ఆశావర్కర్లను అడ్డుకుంటున్న పోలీసు అధికారులు


ఉండ్రాజవరంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆశాకార్యకర్తలు

ఆశావర్కర్ల అక్రమ నిర్బంధం దారుణం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్
- చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరిన ఆశాలు
- పలుచోట్ల అడ్డుకుని స్టేషన్లకు తరలించిన పోలీసులు

దేవరపల్లి, ఫిబ్రవరి 8: ఆశావర్కర్లు న్యాయమైన తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తుండగా అక్రమంగా నిర్బంధించి అరెస్టు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భగత్, నియోజకవర్గ అధ్యక్షురాలు టీపీ లక్ష్మి అన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశావర్కర్లను దేవరపల్లిలో పోలీసు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా భగత్, లక్ష్మి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం చేతకాక ముందస్తుగా నిర్బంధించడం దారుణమన్నారు. ఆశావర్కర్లు చేస్తున్న వెట్టి చాకిరికి ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రజా ఉద్యమాన్ని అణగదొక్కడానికి చూస్తే గత పాలకుల పరిస్థితే పడుతుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు, ఆశావర్కర్లు పిన్నమనేని సత్యనారాయణ, రత్నాజీ, ఐనపర్తి శ్రీనివాస్, మడపట్ల మోహన్, వెంకటలక్ష్మి, బుజ్జమ్మ, భారతి, సరోజిని పాల్గొన్నారు.


తాళ్లపూడిలో ఆశావర్కర్ సుధారాణికి నోటీసు అందజేస్తున్న పోలీసు

తాళ్లపూడి: ఆశా వర్కర్ల సంఘ మండల నాయకురాళ్లు సుధారాణి, రాఘవలకు పోలీసులు నోటీసులిచ్చి గృహనిర్బంధం చేశారు. తాళ్ళపూడి, మలకపల్లి గ్రామాల సంఘ నాయకులకు నోటీసులు అందించారు. కాగా ధర్నాకు వెళుతున్న కొంతమంది కార్యకర్తలను కొవ్వూరులో నిలువరించి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద నిర్బంధించారు.

గోపాలపురం: గోపాలపురం నుంచి బయలుదేరిన 40మంది ఆశా కార్యకర్తల్లో కొందరిని విజయవాడ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. వారిలో 12మందిని గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. మధ్యాహ్నం 2గంటల వరకు స్టేషన్‌లో ఉంచి అనంతరం విడుదల చేశారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండలం నుంచి వెళుతున్న సుమారు 21మందిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వీరిని స్థానిక వెల్‌నెస్ సెంటర్లో ఉంచారు. తమను విజయవాడ వెళ్లనీయకుండా ఆపడం సరికాదని ఆశావర్కర్లు పేర్కొన్నారు.


కొవ్వూరులో పోలీసుల నిర్బంధంలో ఉన్న ఆశాకార్యకర్తలు

అన్ని గ్రామాల్లో 24 గంటలూ త్రీఫేజ్ విద్యుత్

- అవగాహన సదస్సులో ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు



తాళ్లపూడిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఈ వీరభద్రరావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 8: ప్రతి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో 24 గంటలూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ చర్యలు చేపట్టిందని ఈఈ వీరభద్రరావు అన్నారు. రైతులకు అందించే విద్యుత్ సేవలపై తాళ్లపూడి ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మీ సేవ కేంద్రాల్లోనే కాకుండా గ్రామ సచివాలయాల్లోనూ విద్యుత్ సర్వీసు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడీఈ అచ్యుతాచార్యులు మాట్లాడుతూ నూతన సర్వీసులు ఇచ్చే విషయంలో ఆలస్యమైతే అందుకు జేఎల్ఎంలు, ఎల్ఎంలు బాధ్యులవుతారని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్రావు, ఏవో రుచిత, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు శ్రీకృష్ణ దేవరాయులు, రైతులు పుప్పాల వెంకట్రావు, గన్నిన రత్నాజీ, బోడపాటి కాశీ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరిగిన అవగాహన సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ సుంకర త్రిమూర్తులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ వినియోగించే రైతులు సమస్యలను స్థానిక గ్రామ సచివాలయాలు ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన సదస్సులో ట్రాన్స్‌కో డీఈఈ పి.శ్రీధర్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరాలకు దరఖాస్తులు, బిల్లులు చెల్లింపు, రిజిస్ట్రేషన్లు, ఎస్టిమేట్ పేమెంట్ వంటి సేవలు గ్రామసచివాలయాల్లో జరుగుతాయన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పాత లైన్లు మార్చి కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిడదవోలు, తీపర్రు పొలాల నుంచి తాడిపర్రు మీదుగా ఉండ్రాజవరం వరకు హైటెన్షన్ లైన్లు ఏర్పాటు చేసినట్టు డీఈఈ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈ ఎస్.దొరబాబు, జేఈ సుమన్, రైతులు పాల్గొన్నారు.


ఉండ్రాజవరం సబ్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న డీఈఈ శ్రీధర్

దొండపూడిలో జాతీయ రహదారి విస్తరణకు సర్వే


దొండపూడిలో జాతీయ రహదారి సర్వే చేస్తున్న సిబ్బంది

గోపాలపురం, ఫిబ్రవరి 8: జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకు నిర్మించనున్న 265 జాతీయ రహదారి దొండపూడి ప్రధాన సెంటర్‌లో రోడ్డు విస్తరణ కుదించాలని గ్రామస్థులు చేసిన అభ్యర్థనపై రెవెన్యూ యంత్రాంగం యుద్ధ ప్రతిపాదికన సర్వే ప్రారంభించారు. 23 మీటర్ల వెడల్పుతో జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కేంద్ర రహదారుల శాఖ అంచనా వేయడంతో రోడ్డుకు ఒక్క పక్కన ఉన్న నివాసాలు, వర్తక వ్యాపార దుకాణదారులు నష్టపోతారని గ్రామస్థులు అభ్యర్థించడంతో సబ్‌కలెక్టర్ అసితోష్ శ్రీవాత్సవ్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో తహశీల్దార్ వనజాక్షి పర్యవేక్షణలో 2 రోజుల్లో సర్వే పూర్తి చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం వడివడిగా అడుగులు వేస్తోంది. గ్రామస్థులు ప్రస్తుతం ఉన్న రహదారి మధ్య నుంచి రోడ్డుకు ఇరువైపుల 18మీటర్ల రహదారి నిర్మిస్తే వర్తక, వ్యాపార దుకాణాలు, నివాసాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలపడంతో ఆ దిశగా రెవెన్యూ యంత్రాంగం అడుగులు వేస్తున్నట్టు సమాచారం. దీంతో పాటు 23అడుగులు రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల కలిగే నష్టంపై నివేదిక తయారు చేస్తున్నట్టు విశ్వాసనీయ సమాచారం.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

'నన్నయ' వీసీ పద్మరాజు.. ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్‌పై శిక్షణ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 8: కేవీకే సహకారంతో భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, బయోకల్చర్స్ తయారీపై విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం దృష్టి సారించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు అన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగపు సువాస ది స్టూడెంట్ క్లబ్ తరపున విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్ తయారీపై రెండు రోజుల శిక్షణ, వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఐటీ రంగంపై ఆధారపడకుండా ప్రకృతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టిసారించాలన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో దాదాపు 30వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు తెలిపారు. ముఖ్యంగా పంటపోషణకు, రక్షణకు సంబంధించి 22 రకాల బయోకల్చర్స్‌ను ఏవిధంగా తయారు చేసుకోవాలో ప్రదర్శనగా చూపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, నన్నయ వర్సిటీ వృక్ష శాస్త్ర విభాగం ఆచార్యులు వి.పద్మావతి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల కోర్స్ కోఆర్డినేటర్ కె.సామ్యూల్ కుమార్ ఎల్.ముత్యాలనాయుడు, కేవీకే అధికారులు జీవీఆర్ సత్యవాణి, దిలీప్, విజయ్‌వర్ధన్, ప్రభాత్‌నాయుడు, ఎంఏ రాజు, రత్నాజీ ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి

విద్యార్థులు, అధ్యాపకులు విద్యతోపాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమాజహితంగా జీవించాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం బోర్డ్‌ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) అనే అంశంపై వర్క్‌షాప నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బీసీడీఈ కళాశాలల కోఆర్డినేటర్‌లకు, స్టూడెంట్ అంబాసిడర్లకు అవగాహన కల్పించి విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యువతను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేసి సమాజహితమైన కార్యక్రమాలు నిర్వహించడం ప్రధాన లక్ష్యంతో బీసీడీఈ పనిచేస్తోందని తెలిపారు. ఇటీవల ఉన్నతవిద్యలో ప్రవేశపెట్టిన కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టుకు అవసరమైన వనరులను, అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడానికి, వాటిపై అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీసీడీఈ కార్యదర్శి, సీఈవో ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్, కన్సల్టెంట్ కె.సిమ్రాన్, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, బీసీడీఈ యూనవర్శిటీ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌పై అవగాహన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా నిర్వహించే ప్రాక్టికల్స్‌కి సంబంధించి ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు ప్రక్రియపై శ్రీమతి కందు కూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షకులు, పరీక్షల కన్వీనర్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రక్రియను వివరించారు. తూర్పుగోదావరి, రంపచోడవరం, చింతూరు డివిజన్ల నుంచి సైన్సు అధ్యాపకులు, డీఈసీ సభ్యులు హాజరయ్యారు.

డ్రైవర్లు అప్రమత్తతో బస్సులు నడపాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 8: డ్రైవర్లు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, తద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని రవాణాశాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.సబిత, పీవీవీడీ సాయికుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ట్రైనింగ్ స్కూల్‌లో ఆర్టీసీ డ్రైవర్లకు డ్రైవింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ డ్రైవర్లు ఏ విధంగా తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలో తెలియజేశారు.

నేటి నుంచి పలు రైళ్లకు ప్రత్యేక స్టాప్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుణదలలోని మేరీమాత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9నుంచి 11వ తేదీ వరకూ రామవరప్పాడులో పలు రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక స్టాప్ సదుపాయం కల్పించింది. రైలు నెం.17479 పూరి-తిరుపతి, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 17480 తిరుపతి-పూరి, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను రామవరప్పాడులో నిలుపుదల చేస్తారని విజయవాడ డివిజన్ ప్రజా సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం.మండ్రూప్‌కర్ తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

వ్యవసాయ సలహాదారును కలిసిన జేడీ

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం విచ్చేశారు. రెండు రోజులపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన తిరుపాల్‌రెడ్డిని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అయితే ఈయన శుక్రవారం సామర్లకోట, పిఠాపురం, ద్రాక్షారామ, అయినవిల్లి, అంతర్వేది పుణ్యక్షేత్రాలను సందర్శించి పనిలో పనిగా ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడానికి వచ్చినట్టు తెలిసింది. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, పీఏస్ వీరారెడ్డి, ఏఈవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.వేణుమాధవరావు, పీటర్ పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పవన్‌కల్యాణ్

పెరవలి, ఫిబ్రవరి 8: నల్లాకుల వారి పాలేనికి చెందిన కోలా మణికంఠసాయి కుటుంబానికి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మణికంఠసాయి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు పార్టీలో సాయికి క్రియాశీలక సభ్యత్వం ఉందని కోఆర్డినేటర్ ప్రసాద్ దృష్టికి తీసుకెళగా ఆయన జనసేన కార్యాలయం సిబ్బందితో మాట్లాడారు. దీంతో బీమా చెక్కు వచ్చేలా కృషి చేశారు. స్థానిక నాయకులు పిప్పర రవి, పాలా వీరాస్వామి తదితరులు కుటుంబ సభ్యులతో వెంకట శ్రీనివాస్, పార్వతిలను జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తమ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని పవన్ హామీ ఇచ్చినట్టు తెలిపారు.

'ఆశాల నిర్బంధం అన్యాయం'


పోలీసుస్టేషన్ వద్ద ఆశాలకు మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పెరవలి, ఫిబ్రవరి 8: సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ వెళుతున్న ఆశాకార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమని టీడీపీ, జనసేన, బీఎస్పీ నాయకులు అన్నారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయడానికి వెలుతుంటే పెరవలి పోలీసు స్టేషన్‌లో వారికి సానుభూతి తెలపడానికి ఆయా పార్టీలకు చెందిన నాయకులు అక్కడకు వెళ్లి వారి పోరాటానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆశాలు మాట్లడతూ తాము ఎంతోకాలంగా సేవలు చేస్తున్నామని, చాలీచాలని జీతాలతో నెట్టికొస్తున్నామని, సెలవులు కూడా సక్రమంగా లేవని పలు సమస్యలు పై తాము ఆందోళన చేయడానికి వెళుతుంటే అక్రమంగా అరెస్టు చేశారన్నారు.

11న దళిత సింహగర్జన


దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 8: రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ఈనెల 11న అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ నిర్వహిస్తున్న దళిత సింహగర్జన సభకు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని దళిత నాయకులు ఎర్రా రామకృష్ణ, తాళ్ళూరి విజయకుమార్, కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులకు అన్యాయం చేశాడన్నారు. 11న జరిగే దళితుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తాడేపల్లి ప్రసాద్, ఉసురుమర్తి ఆనంద్, టి.అరుణ్, ధార వరప్రసాద్, మోర్త అబ్బులు, మోతా చినబాబు, అరుణ్ బాబు, కొమరపు మనోజ్ పాల్గొన్నారు.

కాపునాడు మద్దతు..

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 8: దళితసింహ గర్జన సభకు కాపునాడు పూర్తి మద్దతు ప్రకటిస్తుందని సంఘం జేఏసీ మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి వెంట్రప్రగడ తెలిపారు రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడకు చెందిన నేత నాగబాబు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు గుదె రఘునరేష్, జామి సత్యనారాయణ, రామినీడి మురళీ మాట్లాడారు. నాలు గున్నరేళ్లలో దళితులకు జరిగిన అన్యాయంపై హర్షకుమార్ చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతును ప్రకటిస్తున్నామన్నారు. సమావేశంలో కాపునాడు జేఏసీ నాయకులు వైశ్రీను, దాసరి గురునాథం, నామ సత్యనారాయణ, విన్నా వాసు, ప్రసాద్, చొడిశెట్టి పల్లంరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	ఈగల్
వై.స్క్రీన్2	లాల్‌సలామ్
దేవిశ్రీ(గాయత్రి)	యాత్ర-2
అనన్య	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	లాల్ సలామ్
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	ఈగల్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్